# మానవ హక్కుల వేదిక

రాష్ట్ర కన్వీనర్ నివేదిక

## ప్రథమ రాష్ట్ర మహాసభ

**మే 7, 8 -2005**

**మిర్యాలగూడెం**

**నల్లగొండ**

మానవహక్కుల కార్యకర్తలకు, మిత్రులకు,

నమస్కారములు. మానవహక్కుల వేదికగా ఏర్పడ్డ తర్వాత మనం నిర్వహించుకుంటున్న మొదటి రాష్ట్ర మహాసభకు మీ అందరికి ఆహ్వానం పలుకుతున్నాను. అన్నింటికంటె ముందుగా, నల్లగొండ జిల్లా, మిర్యాలగూడలో సభ నిర్వహించడానికి పూనుకున్న, నల్గొండ జిల్లా యూనిట్‌ను రాష్ట్ర కార్యవర్గం తరపున, మీ అందరి తరపున అభినందిస్తున్నాను.

మన అవగాహన ఏమిటి, హక్కుల విషయంలో మన ప్రాపంచిక దృక్పథం ఏంటి, మనం ఏ అవగాహనలో సంస్థను స్థాపించుకున్నాం, మనం పనిచేస్తున్న క్రమంలో ఏ మేరకు మనం హక్కుల అవగాహనను కార్యరూపంలో పెట్టాము, ఎక్కడ అసంపూర్తిగా అనిపించింది తదితర విషయాలను, మొదటి మహాసభ సందర్భంగా మనం నిజాయితీతో మాట్లాడుకొని, మన అవగాహనకు, ఆచరణకు సవరణలు ఏమైనా వుంటే చేసుకోవలసిన అవసరం వుందని నేను భావిస్తున్నాను. ఈ సభకు హాజరైన వాళ్ళలో చాలామందిమి గత రెండు దశాబ్దాలకు పైగా హక్కుల సంస్థలో పనిచేస్తూ వస్తున్నాం. ఇట్లా పనిచేస్తున్న క్రమంలో ఒక చారిత్రక దశలో, మన అవగాహనలో ఎక్కడో అసంపూర్ణత, ఆచరణలో ఏదో అసంతృప్తి వున్నట్టు భావించడం జరిగింది. అప్పుడు పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో, సభ్యులుగా మనం హక్కుల అవగాహన విషయంలో, ఆచరణకు సంబంధించి, ప్రాపంచిక దృక్పథానికి సంబంధించి కొన్ని అంశాలు లేవనెత్తి చర్చకు పెట్టడం జరిగింది.

1. హక్కుల ఉల్లంఘనకు ఒకే కేంద్రం ఉందని భావించవచ్చా? ఉల్లంఘన ఒకే స్థానంలో కేంద్రీకరించి చూడవచ్చా?

2. హక్కుల ఉద్యమానికి తనదంటూ ఒక అవగాహన, అస్థిత్వం, స్వతంత్రత వుండడం అవసరమా?

3. హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు ఎవరితో ఏ ఏ సంఘాలు, రాజకీయ పార్టీలతో ఐక్యసంఘటనలో పాల్గొనవచ్చు.

4. సామాజిక మార్పు కోసం పనిచేస్తున్న రాజకీయ పార్టీలు, సంస్థలు

పనిచేస్తున్న క్రమంలో ప్రజలతో అప్రజాస్వామికంగా ప్రవర్తించి, వాళ్ళ హక్కులకు భంగం కలిగించినప్పుడు, హక్కుల సంఘంగా మన వైఖరి ఎట్లా వుండాలి?

5. సమాజాన్ని సమూలంగా మార్చవలసి వుందని, ఒక సిద్ధాంతం వెలుగులో, మార్పుకోసం ఉద్యమాలు నిర్మిస్తున్న ఉద్యమకారులపట్ల, ఉద్యమాల పట్ల మనం ఎలాంటి సంబంధాలు పెట్టుకోవచ్చు.

ఈ పైన పేర్కొన్న అయిదు అంశాల్ని చర్చకు పెట్టడం జరిగింది. ఈ అంశాల వెలుగులో వ్యాసాలు ప్రచురించి అన్ని జిల్లాలలో చర్చ కూడా జరిగింది. చర్చ జరుగుతున్న క్రమంలో నిర్దిష్టంగా హక్కుల తాత్విక చింతనను కూడా ముందు పెట్టడం జరిగింది.

1. హక్కుల ఉల్లంఘన ఒక రాజ్యం చేతిలోనే కాకుండా, భారతదేశంలోని అసమాన సమాజంలో నెలకొని వున్న కులం, వెనుకబాటుతనం, స్త్రీలపై వివక్ష, పేదరికం, సమాజం అన్ని రంగాలల్లో అసమానత వ్యవస్థల వల్ల కూడా హక్కుల ఉల్లంఘన జరుగుతుంది.

2. హక్కుల ఉద్యమానికి తనదైన అస్థిత్వం, అవగాహన మరియు పూర్తి స్వతంత్ర ఆచరణ వుండాలి.

3. హక్కుల ఉల్లంఘన విషయంలో ఆందోళన కార్యక్రమాల్ని, ఇతర హక్కుల సంస్థలతో మాత్రమే కలిసి చేపట్టాలి. హక్కుల ఉల్లంఘనపై రాజకీయ పార్టీలు, పార్టీల అనుబంధ సంస్థలు కార్యక్రమాలు చేపడితే వాటిల్లో పాల్గొనవచ్చు. కాని దాని కార్యాచరణ నిర్మాణంలో భాగంగా వుండరాదు.

4. సామాజిక మార్పు కోసం పనిచేస్తున్న ఏ పార్టీగాని, సంస్థగాని దాని ఆచరణలో ప్రజలతో అప్రజాస్వామికంగా ప్రవర్తించినా, అనవసరంగా హింస ప్రయోగించినా అది తప్పు అని చెప్పే బాధ్యత హక్కుల సంఘాలకు వుంది.

5. ప్రజా ఉద్యమాలతో, విప్లవ పార్టీలతో స్నేహ సంబంధాలు పెట్టుకోవచ్చా అనే అంశంలో, ప్రజాతంత్ర ఉద్యమాలు చేపట్టే సమస్యలోంచి ఉత్పన్నమయ్యే హక్కుల అంశాల్ని క్రోడీకరించుకోవడం, పోరాటాలనుండి ఆకాంక్షల

నుండి పుట్టే విలువలను, హక్కులను నిలబెట్టడం, సంపాదించడం హక్కుల ఉద్యమం కర్తవ్యంగా వుండాలి.

ఈపైన వివరించిన హక్కుల దృక్పథం ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలోని మెజారిటీ సభ్యులకు అంగీకారంగా లేదని గుంటూరులో (1998) జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో తేల్చడం జరిగింది. ఇందుకు భిన్నంగా దృక్పథాన్ని వ్యక్తపరచిన 46 మంది సభ్యులు మైనారిటీలో ఉన్నందువల్ల ఇది సంస్థ దృక్పథం కాజాలదనే అభిప్రాయం వ్యక్తమయింది. తర్వాత హైదరాబాద్‌లో జరిగిన 10వ **ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం సభలో**, సంస్థ దృక్పథానికి భిన్నంగా, సంస్థలో బాధ్యతలో వున్నవాళ్ళు పనిచేయడం సరికాదని, అప్పటి రాష్ట్ర కార్యదర్శి బాలగోపాల్‌తో సహా ఇతరులు సంస్థ బాధ్యతల నుండి తప్పుకున్నారు. బాలగోపాల్, వసంతలక్ష్మి, చంద్రశేఖర్(గుంటూరు)గార్లు ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. దృక్పథం పట్ల ఏకాభిప్రాయం లేకున్నా ప్రాథమిక సభ్యులుగా వుంటూ కార్యక్రమాల్లో పాల్గొనవచ్చనే అభిప్రాయం కూడా కొందరు వ్యక్తం చేసారు. మెజారిటీ అభిప్రాయానికి, మైనార్టీ సభ్యులు కట్టుబడి వుండవలసి వుంటుందని, ఇది ప్రజాస్వామ్య ప్రక్రియలో ఒక భాగమని, చాలా సంస్థల్లో కమ్యూనిస్టు పార్టీలో ఇదొక ప్రధాన అంశం అనే వాదన ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం బాధ్యులు మా ముందు పెట్టారు. ఈ తరుణంలో అక్టోబర్ 11, 1998న, హైదరాబాద్, నాంపల్లిలోని హిందీ ప్రచార సభలో, గుంటూరులో జరిగిన ప్రత్యేక సమావేశంలో చర్చకు పెట్టిన అంశాలతో విభేదించిన మిత్రుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అనంతపూర్, చిత్తూరు, గుంటూరు, ఒంగోలు, కర్నూలు, వరంగల్, కరీంనగర్, నల్లగొండ మరియు హైదరాబాద్‌ల నుండి వచ్చిన 33 మంది హాజరైనారు. ప్రస్తుతం మన కర్తవ్యం ఏమిటి అనే అంశంపై చర్చ జరిగిన తర్వాత, మనం ఒక ప్రత్యేక సంస్థగా ఏర్పడితే తప్ప మన దృక్పథానికి అనుగుణంగా పనిచేయడానికి వీలుకాదు, ఏపిసిఎల్‌సిలో కొనసాగుతూనే, ఒక సంస్థగా పనిచేయవచ్చని, ఏర్పడబోయే సంస్థ ఏపిసిఎల్‌సికి పోటీ సంస్థ కాదని, ఆ సంస్థకు రాజీనామా చేయడమా, వద్దా అనే విషయం

సభ్యులకే వదిలేయాలని, సంస్థ విశాల ప్రాతిపదికపై పనిచేయడానికి అనువుగా వుండటానికి **మానవహక్కుల వేదిక** (HUMAN RIGHTS FORUM) అని పేరు పెట్టుకోవడం జరిగింది. ప్రజలు పునాదిగా, విశాలమైన అవగాహనతో కార్యక్రమాలు చేపట్టాలని, కొన్ని అంశాలపై పనిచేయాలని అవగాహన కుదిరింది. ప్రస్తుతానికి ఎపిసిఎల్‌సి దృక్పథంతో విబేధించిన వారితోనే సంస్థ నడుస్తుందని, అవగాహన కుదిరింది. పత్రం రాసుకొని కొంత కాలం పనిచేసిన తర్వాత కొత్త సభ్యుల్ని తీసుకునే అంశం పరిశీలిద్దాం అనే అంగీకారం కుదిరింది. మానవహక్కుల వేదికకు, ఎస్. జీవన్‌కుమార్, ఎ. సునీత, మధుసూదన్‌రాజ్ గార్లను రాష్ట్ర కన్వీనర్లుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ క్రింది అంశాలపై కార్యక్రమాలు నిర్వహించిన తర్వాత మళ్లీ ఒకసారి సమావేశమై సమీక్ష చేసుకోవాలని అనుకున్నాం.

1. కార్మిక హక్కుల చట్టాలపై కార్యక్రమాల నిర్వహణ

2. పనిస్థలాల్లో మహిళలపై లైగింక వివక్ష విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఆఫీసుల్లో ప్రచారం చేయడం

3. విజయనగరం జిల్లాలో దళితుల బహిష్కరణపై విషయ సేకరణ చేసి నివేదిక తయారుచేయడం

4. ఖమ్మం జిల్లాలో గిరిజనుల భూమి సమస్య-తుమ్మల నాగేశ్వరరావు జోక్యంతో పరిష్కారం అయిందన్న అంశం పరిశీలించి నివేదిక తయారు చేయుట

5. హైదరాబాద్‌లో రౌడీషీటర్ల విషయంలో విషయసేకరణ చేయుట

6. బొంబాయి అల్లర్లపై విచారణ జరిపిన శ్రీకృష్ణ కమీషన్ రిపోర్ట్‌ను తెలుగులో ప్రచురించడం.

**మానవహక్కుల వేదిక** పేరుతో మనం సంస్థను ఏర్పరచగానే, మనం ఏ దృక్పథంతో పనిచేయదల్చుకున్నామో, ఏ అవగాహనతో కార్యక్రమాలు వుంటాయో చూడకుండానే, చాలా మంది మానవహక్కులు అనే పేరుకు తమ బుద్ధికి తోచిన వ్యాఖ్యానాలు చేసి, సంస్థపై తీర్పు చెప్పేశారు. **మానవ హక్కులు** అనే భావన శ్రమదోపిడీని చూడజాలదని ఒకరంటే, మానవ

హక్కులంటే అమెరికా ఇరాక్ పైదాడిని సమర్థించడమని ఇంకొకరు అభిప్రాయపడ్డారు. మానవహక్కుల గురించి మాట్లాడుతున్నామంటే ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు, పీడకులు, పీడితులు అనే తేడా లేకుండా అందరినీ ఒకే గాటన కట్టడం అని ఇంకొకరు వ్యాఖ్యానించారు.

మానవహక్కుల వేదిక ఏర్పడటం ఒక దురదృష్టకరమైన పరిణామం అని ఒక హక్కుల సంఘం అధికారికంగా ప్రకటిస్తే, మానవహక్కుల పేరుతో స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు(NGO's) తమ వ్యాపారాన్ని ముమ్మరంగా సాగిస్తున్న నేపథ్యంలో మానవహక్కుల వేదిక ఆవిర్భావాన్ని అర్థం చేసుకోవాలని మరొక హక్కుల సంఘం, బాధ్యతారాహిత్యంగా, అధికార ప్రకటన రూపంలో వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలకు మనం ఎప్పుడు విడిగా జవాబు చెప్పాలనుకోలేదు. మన కార్యాచరణ, మన కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రమంలో లేవనెత్తే అంశాలు జవాబుగా ముందుకు రావాలి అనుకున్నాం. ఏ ఒక్క సమస్య దగ్గర ఆగిపోని, ఏ ఒక్క ప్రగతిశీల దృక్పథానికి పరిమితం కాని, ఏ ఒక్క రాజకీయ ఉద్యమానికి నిబద్ధం కాని విశాల ప్రాతిపదికగల హక్కుల వుద్యమం నిర్మించే దిశలో మానవహక్కుల వేదిక ఎదగాలని మనం కాంక్షించాం. మనం ప్రతిపాదించిన దృక్పథం కూడా సంస్థతోపాటు ఎదగాలని మనం భావించాం.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘంలో, హక్కుల ప్రాపంచిక దృక్పథం, సంస్థ స్వతంత్ర ప్రతిపత్తి, అస్తిత్వం గురించి జరిగిన చర్చను ప్రయివేటు హింస, నక్సలైట్లు చేస్తున్న హింసకు పరిమితం చేసి పత్రికలు రాసాయి. నక్సలైటు పార్టీలు చేసే హింసను ఖండించడానికే మానవహక్కుల వేదిక ఏర్పడిందనే భావనను కొన్ని పత్రికలు వెలిబుచ్చాయి. నక్సలైటు పార్టీలు అప్పుడప్పుడు చేసే అప్రజాస్వామిక చర్యల గురించి పౌరహక్కుల ఉద్యమంలో జరిగిన చర్చను రాజ్యహింస వర్సెస్ ప్రయివేట్ హింసగా కుంచించిన చట్రంలోంచి చూడడం వల్ల ఏర్పడ్డ భావనగా మనం అర్థం చేసుకున్నాం. నక్సలైట్ పార్టీలు చేసే పనులు ప్రజలకు కొన్నిసార్లు అపకారం కల్గిస్తున్నా, వాటిని విమర్శిస్తే రాజ్యాంగ యంత్రానికి తోడ్పడినవాళ్ళమౌతామనే భయం

చాలాకాలంగా పౌరహక్కుల కార్యకర్తల్లో వుంది. ఇప్పటికి ఆ భావన కొనసాగుతుంది కూడా. అయితే ప్రజలకు జవాబుదారిగా వుండే హక్కుల సంఘాలు, ఇటువంటి అభిప్రాయం కలిగివుండటం సంస్థకు నష్టకరమని ఈ మధ్యకాలంలో మనం స్పష్టంగా గమనించాం. మనం రాజ్యహింసను, నక్సలైట్లు చేసే హింసను ఎప్పుడు ఒకే గాటన కట్టి చూడలేదు. అయితే నిజమైన ప్రజాస్వామ్యం కోసం, సామాజిక మార్పు కోసం, ప్రజల కోసం పోరాటం చేస్తున్నామని చెప్పుకునే వుద్యమాలు ప్రజలతో అప్రజాస్వామికంగా ప్రవర్తించినప్పుడు, అనవసరంగా హింస ప్రయోగించినప్పుడు మన వేదిక ఖచ్చితంగా ఖండిస్తుంది అని చెప్పాం, కొన్ని సంఘటనలు ఖండించాం కూడా. ఉద్యమాలు చేసే పొరపాట్లు ఎత్తిచూపడం హక్కుల సంఘాల బాధ్యతగా వుండాలని కూడా భావిస్తున్నాం.

ఇతరులను సభ్యులుగా చేర్చుకునే విషయం తర్వాత ఆలోచించాలని, అవగాహన పత్రం రాసి అందరికి పంపాలని నిర్ణయం జరిగింది. తర్వాత జరిగిన రాష్ట్ర కార్యవర్గంలో బాలగోపాల్‌గారిని కార్యవర్గానికి కో ఆప్ట్ చేసుకున్నాం. రెగ్యులర్ పత్రిక కాకుండా, హక్కుల అంశాల మీద వివరంగా వివిధ కోణాలనుండి విషయాల్ని అందించడానికి బులెటిన్ ప్రచురించాలని, దాని బాధ్యత వసంతలక్ష్మి, కోదండరాం, జీవన్‌కుమార్‌గార్లకు అప్పగించడం జరిగింది. కనీసం ఆరునెలలకొకసారి **మానవహక్కులు** పేరుతో బులెటిన్ ప్రచురించాలనే నిర్ణయం జరిగింది.

గత ఏడు సంవత్సరాలలో సమాజంలో మన దృష్టికి వచ్చిన అన్ని అంశాలపై శక్తి మేరకు కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.

**ఆదివాసీల సమస్యలు:** మన సంస్థ ఆవిర్భవించిన తొలిరోజుల్లోనే ఆదివాసీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున అతిసారం, మలేరియా వ్యాధులవల్ల ఆదివాసీల మరణాలు సంభవించాయి. 1998లో ఆదిలాబాద్‌లో దాదాపు 2000 మంది దాకా అతిసారా వ్యాధి వల్ల మరణించారు. మన సంస్థ ఆ ప్రాంతాలు పర్యటించి విషయాలు బయటకు తెచ్చాం. ఒక ఆదివాసీ సంస్థ మన సహాయంతో కోర్టునాశ్రయించగా ప్రభుత్వం గిరిజన ప్రాంతాల్లోకి

యుద్ధప్రాతిపదికన ప్రత్యేక డాక్టర్ల బృందాన్ని పంపింది. సంవత్సరం తర్వాత విశాఖపట్నం జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాల్లో దాదాపు 2000 పైగా గిరిజనులు అతిసారా, మలేరియాతో మరణించారు. ఈ విషయంలో మన సంస్థ ఆ ప్రాంతాలు పర్యటించి చాలా వివరాలు సేకరించింది. ఒక కరపత్రాన్ని వేసి మూడు మండలాల్లో సమావేశం నిర్వహించాం. ఇప్పటికి ఆదివాసీల ఆరోగ్యం విషయంలో సమగ్ర ఆరోగ్య పథకం ఏదీ ప్రభుత్వం చేపట్టినట్లు లేదు. ప్రతి వర్షాకాలం ప్రారంభంలో, ఎండాకాలంలో, ఆదివాసీల ప్రాంతాలనుండి ఇటువంటి విషయాలు పత్రికల్లో వార్తలరూపంలో వస్తూనే వున్నాయి. ఆదివాసీల ఆరోగ్య భద్రత విషయంలో ప్రభుత్వం చేపట్టవలసిన కార్యక్రమాల గురించి మనం ఆలోచించి, ప్రతిపాదనలు ప్రభుత్వం ముందుకు పెట్టవలసి వుంది. పెబ్బేరు, తారకరామ, ఉరగగడ్డ రిజర్వాయర్ నిర్వాసితుల విషయంలో మద్దివలస ప్రాజెక్టువల్ల ముంపుకు గురైన గ్రామాల ప్రజల సమస్యల గురించి ప్రభుత్వం దృష్టికి తేవడం జరిగింది. ఈ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదార్ల యూనియన్‌తో కలిసి విశాఖ యూనిట్ కార్యక్రమాలు నిర్వహించింది.

ఆదివాసీల భూమి సమస్య గురించి ఆదివాసీల సంఘాలు, కొన్ని రాజకీయ పార్టీలు, హక్కుల సంఘాలు చాలాకాలంగా ఆందోళన చేస్తూనే వున్నాయి. ఎల్‌టిఆర్(1/70) చట్టాన్ని ఎట్లైనా సవరించాలని మన రాష్ట్ర ప్రభుత్వం చాలా ఉబలాటం చూపింది. ఒక శాసనసభా కమిటీ కొన్ని ప్రతిపాదనలతో స్పీకర్‌కు నివేదిక సమర్పించింది. నక్సలైట్ ఉద్యమం, ఆదివాసీ సంఘాలు, కొన్ని స్వచ్ఛంద సంస్థల కృషి వల్ల ఆదివాసీల్లో వాళ్ళ భూములకు సంబంధించిన విషయ పరిజ్ఞానం పెరిగి, వాళ్ళ ఆందోళన పటిష్టరూపం తీసుకుంది. ఫలితంగా గిరిజనులు, గిరిజనేతరుల మధ్య సంఘర్షణ మొదలైంది. ఆదివాసీలు భూమిపై తమ హక్కు గురించి ప్రశ్నించినప్పుడల్లా, ప్రభుత్వం దాని పరిష్కారాన్ని కనుగొనే బదులు, పోలీసుల ద్వారా వాళ్ళ ఆందోళనలను అణిచే ప్రయత్నం చేసింది. మన వేదిక చాలాసార్లు తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం ప్రాంతాలు పర్యటించి విషయాలు బయటకు తేవడం జరిగింది.

ఉత్తరాంధ్ర ఏజన్సీ ప్రాంతంలో సమృద్ధిగా వున్న బాక్సైట్ ఖనిజాల్ని తవ్వకం చేయడానికి, ఒక ఆస్ట్రేలియా కంపెనీకి అనుమతి ఇవ్వడానికి చంద్రబాబు ప్రభుత్వం ప్రయత్నించింది. అయితే ఈ ప్రాంతాలు అయిదవ షెడ్యూలులో వుండటంవల్ల తప్పకుండా కేంద్ర ప్రభుత్వం అనుమతి కావాలి. అందుకోసం, ఆ షెడ్యూలును కూడా సవరించవలసి వుంటుంది. చంద్రబాబునాయుడుకు కేంద్రంతో వున్న సత్సంబంధాల వల్ల అయిదవ షెడ్యూలు సవరణ కోసం ప్రయత్నాలు ప్రారంభించాడు. మనం ఈ విషయంపై భారత రాష్ట్రపతికి విజ్ఞాపన పత్రాన్ని రాసి దానిపై దాదాపు వెయ్యి సంతకాలు సేకరించి పంపడం జరిగింది. దేశవ్యాప్తంగా దీనిపై నిరసన వచ్చింది. మనం, ఓపిడిఆర్ సంస్థతో కలిసి ఒక కరపత్రాన్ని కూడా ముద్రించాం. చాలా పెద్ద ఎత్తున నిరసన రావడంతో ప్రభుత్వం ఆదివాసీల ప్రాంతంలో గనులను లీజుకిచ్చే ప్రయత్నాన్ని మానుకుంది.

కేంద్ర ప్రభుత్వ పర్యావరణ అటవీశాఖ 2002వ సంవత్సరం మే నెలలో, ఆదివాసీ ప్రాంతాల్లో 1980 తర్వాత ఏజన్సీ ఏరియాలో భూములపై వున్న చొరబాటుదార్లను గుర్తించి ఏరివేయాలని ఒక సర్క్యులర్‌ను జారీచేసింది. సుప్రీంకోర్టులో చాలాకాలంగా నడుస్తున్న గోదవర్మన్ కేసు సందర్భంలో, సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యాలననుసరించి ఈ సర్క్యులర్ వెలువడింది. ఈ సర్క్యులర్‌ను మహారాష్ట్రలోని పడమటి కనుమల ఏజన్సీ ప్రాంతాలలో బలవంతంగా అమలు చేయడం మొదలుపెట్టినప్పుడు, ఈ సర్క్యులర్ భయంకర స్వరూపం తెలిసి, దేశవ్యాప్తంగా నిరసన మొదలైంది. మనం ఈ సర్క్యులర్ వచ్చిన నేపథ్యాన్ని, మొత్తం విషయాన్ని వివరిస్తూ **ఎవరిదీ అడవి** అనే పుస్తకాన్ని ప్రచురించాం. ఆదివాసీ ప్రాంతాల్లో, విశాఖపట్నం, రాజమండ్రిలలో సమావేశాలు నిర్వహించాం, ఇతర సంస్థలు నిర్వహించిన సమావేశాల్లో చురుకుగా పాల్గొన్నాం.

ఆదివాసీల సమస్యలపై మన సంస్థ, ఇతర ఏ సంస్థలు సమావేశాలు నిర్వహించినా, కార్యక్రమాలు చేపట్టినా పాల్గొంటూనే వున్నాం. ఆ సంస్థలు రాజకీయ పార్టీలకనుబంధంగా వున్న గిరిజన సంఘాలైనా, స్వచ్ఛంద సంస్థలైనా,

ప్రభుత్వేతర సంస్థలైనా ఆదివాసీల సమస్యలపై చాలా ఆందోళన చేయవలసిన అంశాన్ని దృష్టిలో పెట్టుకుని పాల్గొంటున్నాం. తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి ఏజన్సీ ప్రాంతాల్లో పనిచేస్తున్న చాలా ఆదివాసీ సంఘాలకు, రాజమండ్రి నివాసి శ్రీ పల్లా త్రినాధ్‌రావుగారు సలహాదారుగా, సహాయకుడిగా నిర్విరామంగా కృషి చేస్తున్నాడు. ఆదివాసీలకు న్యాయపరమైన సహాయం చేయడం ఒక్కటే తన సిద్ధాంతంగా పెట్టుకుని కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఈయనకు మన సంస్థ పూర్తి సహకారాన్ని అందించింది. ఈయన సలహాదారుడుగా వున్న అన్ని గిరిజన, యువ, మహిళా, విద్యార్థి సంఘాల కార్యక్రమాల్లో మనం పాల్గొన్నాం. ఈ సంస్థలు రాజమండ్రిలో, జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన హక్కుల అవగాహన తరగతుల్లో ఉపన్యాసకులుగా, వివిధ అంశాలపై మన కార్యకర్తలు తరగతులు నిర్వహించారు. ఇప్పుడు ఆదివాసీల సమస్యలపై ఒక సమన్వయ పుస్తకం తెచ్చే ప్రయత్నంలో వున్నాం. ఆదివాసేతరులు కొందరు రాజకీయనాయకులు త్రినాధరావుగారిని ఇబ్బందులకు గురిచేసి కార్యక్రమాల నుండి విరమింపజేయడానికి ప్రయత్నాలు జరిపినప్పుడు మనం త్రినాధరావుగారికి పూర్తి మద్దతు ఇచ్చి నైతికంగా ఆయన ప్రక్క నిలుచున్నాం. శ్రీకాకుళం జిల్లాలో కవితి, కంచిలి, ఇచ్ఛాపురం ఎమ్ ఆర్ వోలు, బెంతిబరియా అనే ఆదివాసులకు కులసర్టిఫికెట్లు ఇవ్వడానికి నిరాకరించాడు. ఈ ప్రజలు ఒరిస్సానుండి సరిహద్దులు దాటి వచ్చారని, వాళ్ళు ఆదివాసీలు కారని, మన రాష్ట్రంలోని జాబితాలో వాళ్ళ పేరు లేదని వాదించారు. వాళ్ళ విషయాన్ని మనం ప్రభుత్వం దృష్టికి తెచ్చి వాళ్ళకు కుల సర్టిఫికెట్లు ఇప్పించడంలో సహాయం చేసాము.

పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపుకు గురయ్యే గ్రామాలకు వెళ్ళి ప్రజలను కలిసి అభిప్రాయ సేకరణ చేయడం జరిగింది. ముంపుకు గురయ్యే 260 గ్రామాల్లో 200లకు పైగా ఆదివాసీ గ్రామాలే. ఆదివాసీలకు ఈ ప్రాజెక్టు పట్ల చాలా వ్యతిరేకత వుంది. రాజకీయ పార్టీలు, ముఖ్యంగా ఈ గ్రామాల్లో కొంత బలం వున్న వామపక్ష పార్టీలు ప్రజల అభిప్రాయం పట్టించుకోకుండా అభివృద్ధి జరగాలంటే ప్రాజెక్టు నిర్మించాలి. తగురీతిలో నష్టపరిహారం కోసం

ప్రయత్నించాలి అనే వాదనను ముందుకు తెస్తున్నారు. ఆదివాసీ సంస్థలు, ఆదివాసీ సంఘాలు వుద్యమం చేయడానికి సమాయత్తమవుతున్నాయి. ముందుగా అన్ని గ్రామాల్ని కలుపుతూ ఒక పాదయాత్ర నిర్వహించాలనే తలంపుతో వున్నాయి. ఉద్యమంలో మనల్ని భాగస్తుల్ని కమ్మని, మన సహాయ సహకారాలను ఈ సంస్థలు కోరుతున్నాయి. ఈ వుద్యమానికి మద్దతు తెలుపుతూ ఒక **సాలిడారిటీ కమిటీ** ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించాలి. ఈ విషయంలో నిర్ణయం తీసుకుని కార్యక్రమం రూపొందించుకోవలసి వుంది. షెడ్యూలు ప్రాంతంలో లేని ఆదివాసీ గ్రామాల సమస్యపై కూడా మన సంస్థ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదార్ల యూనియన్‌కు సహకరిస్తూ కొన్ని కార్యక్రమాలు చేపట్టారు. నాన్ షెడ్యూలు గ్రామాల ప్రజలు జరిపిన పాదయాత్రలో పాల్గొన్నాం. కొన్ని ప్రాంతాల్లో జరిగిన సమావేశాల్లో పాల్గొన్నాం. 2004వ సంవత్సరం మార్చి నెలలో మన సంస్థ సహకారంతో ఈ సమస్యపై ఒక రాష్ట్ర స్థాయి సదస్సును వ్యవసాయ వృత్తిదార్ల యూనియన్ నిర్వహించింది. 1980లో ప్రభుత్వం సర్వే జరిపి 796 గ్రామాలను షెడ్యూలు ప్రాంతాలుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. కాని ఆ విషయానికి సంబంధించిన ఫైలు ఇన్ని సంవత్సరాలుగా అలాగే పడివుంది. ఈ సమస్యపై కార్యక్రమాలు చేపట్టి, విషయాన్ని వార్తల్లోకి తెచ్చినందువల్ల, దాని గురించి ప్రభుత్వంలో కొంచెం కదలిక వచ్చిందని తెలిసింది.

**దళితుల సమస్యలు:** స్వాతంత్రం వచ్చి 60 ఏళ్ళు కావస్తున్నా, సమాజంలో దళితులపై రకరకాలుగా వివక్ష కొనసాగుతూనే వుంది. దళితులపై భౌతికదాడులు, దళితస్త్రీలపై అత్యాచారాలు, దళితుల గ్రామ బహిష్కరణ, వేధింపులు, బాణామతి చేస్తున్నారనే ఆరోపణలతో దళితుల హత్యలు మన రాష్ట్రంలో చాలా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం దళితులపై దాడులు, వివక్ష, అణచివేత పరిస్థితులను సమీక్షించి వాటిని నివారించడానికి సూచనలిమ్మని జస్టిస్ పున్నయ్య కమీషన్‌ను నియమించింది. ఆయన వివిధ జిల్లాలు పర్యటించి దళితుల నుండి, దళిత సంఘాల నుండి, ఇతర ప్రజాతంత్ర ఉద్యమాల నుండి ఫిర్యాదులు స్వీకరించాడు. మన వేదిక కూడా జస్టిస్ పున్నయ్యగార్కి,

పరిస్థితిని వివరిస్తూ కొన్ని నిర్దిష్టమైన సూచనలు చేస్తూ మెమోరాండం సమర్పించింది. జస్టిస్ పున్నయ్యగారు తను సమర్పించిన ఫైనల్ నివేదికలో మన సంస్థ చేసిన కొన్ని సూచనలను ప్రత్యేకంగా ప్రస్తావించాడు.

దళితుల సమస్యలపై ప్రత్యేకంగా నెల్లూరు, ప్రకాశం, వరంగల్, కర్నూలు జిల్లా యూనిట్స్ చాలా కృషి చేసాయి. జరిగిన ప్రతి అత్యాచారం, వివక్షపై వివరాలు సేకరించారు. ఇతర దళిత సంఘాలతో కలిసి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతపూర్‌లో ఫ్యాక్షనిస్టు రాజకీయాల్లో దళితులు నలిగి పోవడం, చివరకు ప్రాణాలు పోగొట్టుకోవడం, ఫ్యాక్షనిస్టు ముఠాలవల్ల సామాన్య ప్రజలు హక్కులు కోల్పోతున్న వైనాన్ని మనం కరపత్రాల ద్వారా చెప్పాం.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మన సంస్థకు దళిత సంఘాలతో స్నేహపూరిత సంబంధాలున్నాయి. ఎమ్ ఆర్ పిఎస్ వుద్యమం మొదలైనప్పుడు ముందుగా ఆ వుద్యమాన్ని బలపరచి, మాదిగ మరియు ఇతర కులాలకు చెందిన ప్రజలు ఏ విధంగా రిజర్వేషన్ల ఫలితాలు అందుకోలేక, సమాజంలో వివక్షకు గురౌతున్నారో వివరంగా, అన్ని సమావేశాలలో మాట్లాడాం. వర్గీకరణను బలపరుస్తున్నందుకు మాలమహానాడు సంస్థ హక్కుల సంఘాలపై అనవసరంగా విరుచుకుపడింది కూడా.

నెల్లూరు జిల్లాలో యానాదులపై, దళితులపై అధికార్ల వివక్ష, అగ్రకులస్తుల దాడులు బాగా ఎక్కువగా సంభవిస్తుంటాయి. నెల్లూరు యూనిట్ యానాదులపై పోలీసు దాడులు, వాళ్ళకు ప్రభుత్వం ఇచ్చిన భూముల్ని అనుభవించలేని పరిస్థితి ఎప్పటికప్పుడు రాష్ట్ర కమిటీ దృష్టికి తెస్తూ వుంది. వాళ్ళ సమస్యల గురించి రెండు మూడు పర్యాయాలు హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో మాట్లాడటం జరిగింది. నెల్లూరు ఎస్.పి. దళితులపై అత్యాచారం విషయంలో ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు చేసినప్పుడు తన అనుమతి తీసుకోవాలనే సర్క్యులర్ జారీ చేయడం వల్ల పోలీసులు పూర్తిగా కేసులు పెట్టడం మానేసారు. ఈ విషయం అసెంబ్లీలో చర్చకు కూడా వచ్చింది. ఈ విషయంలో మనం కూడా ప్రభుత్వానికి ఒక మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఇప్పటికి నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల్లో దళితులపై

అత్యాచారాలు జరుగుతూనే వున్నాయి. పోలీసులు నిందితులపై సరిగా కేసులు పెట్టడం లేదు. ఈ విషయంలో ఒక రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించాలని నెల్లూరు యూనిట్ చేసిన ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. గత వారం ఆదోనిలో కూడా ఈ సమస్యపై ధర్నా జరిగింది. ఈ సమస్యపై సమీక్ష జరుపుకొని మనం ఒక కార్యక్రమం తీసుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తేవలసి వుంది. ఎస్సి, ఎస్టి కమిషన్ ఏర్పరచిన తర్వాత కూడా పరిస్థితిలో పెద్ద మార్పు లేదు. ప్రతి ఫిర్యాదు ఛైర్మన్ పొన్నయ్యగారికి పంపుతూనే వున్నాం. ఆయనను కలిసి మాట్లాడుతునే వున్నాం. ఈ కమిషన్‌కు ఒక స్వతంత్ర విచారణ చేసే నిర్మాణం లేదని, ఈ సంస్థకు అధికారాలు కూడా ఏమీ లేవనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. మనం చొరవ తీసుకుని దళిత సంఘాలను, మేధావులను సమావేశపరచి కమిషన్ అధికారాల్లో తేవలసిన మార్పుల గురించి ఆలోచించవలసి వుంది.

**రైతుల సమస్యలు:** 1991లో వ్యాపార పంటయిన పత్తికి పురుగు రావడం, పత్తికి మద్దతు ధర లభించకపోవడం వల్ల భారీ నష్టాలకు గురికావడం వల్ల కేవలం పత్తి పండించిన రైతులు మాత్రమే ఆత్మహత్యలకు పాల్పడ్డారు. తర్వాత 1998 నుండి వరంగల్, కరీంనగర్‌లో మొదలైన రైతు ఆత్మహత్యల సంఘటనలు అనంతపురం జిల్లాకి పాకి, ఉత్తరాంధ్రతోపాటు దాదాపు రాష్ట్రమంతటా వ్యాపించాయి. తెలుగుదేశం ప్రభుత్వం ఈ ఆత్మహత్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించింది. బాధ్యతారాహిత్యంగా మంత్రులు వ్యాఖ్యానాలు చేశారు. మన వేదిక 14 జిల్లాల్లో వందకు పైగా మరణించిన కుటుంబాలను కలిసి విషయ సేకరణ చేసింది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన సంఘటనల్లో అనాథలైన కుటుంబాలకు ప్రభుత్వం ఏమీ నష్టపరిహారం ఇవ్వలేదు. కరీంనగర్ జిల్లాలో మాత్రం మన సూచన మేరకు బాధితుల కుటుంబాల్లోని పిల్లలను కొందరిని ఆశ్రమ పాఠశాలల్లో చేర్పించారు. రైతులకు ఋణాలు అందించవలసిన సంస్థలు రైతుల్ని పట్టించుకోకపోవడం, శ్రేష్టమైన విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు లభ్యం కాకపోవడం, పండిన కొద్దిపాటి పంటకు మార్కెట్‌లో ధర లేకపోవడం, చంద్రబాబు

ప్రభుత్వం చిన్న సాగునీటి వ్యవస్థను నిర్లక్ష్యం చేయడం, సంస్కరణల్లో భాగంగా విద్యుత్ ఛార్జీలు పెరగడం, బోర్ల తవ్వకం కోసం ఎక్కువ డబ్బులు ఖర్చు పెట్టడం, జీవనవ్యయం పెరగడం, మొత్తం ఖర్చులకోసం ప్రయివేటుగా వడ్డీ వ్యాపారస్తుని దగ్గర మార్కెట్లో ఏజెంట్ దగ్గర అప్పులు తీసుకువచ్చి, వడ్డీతో అసలు మోపెడై కట్టలేని పరిస్థితిలో మాత్రమే రైతులు ఆత్మహత్యలకు పాలుపడుతున్నారని మన పరిశీలనలో అర్థం అయింది. కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పులపై మారిటోరియం ప్రకటించి, రైతు మరణించిన బాధలో వున్న కుటుంబాలకు నష్టపరిహారం ప్రకటించింది. కాని నష్టపరిహారం అందరికీ అందడం లేదనే విమర్శ వచ్చినప్పుడు 8 జిల్లాలు తిరిగి, నష్టపరిహారం పొందని కుటుంబ సభ్యులను కలిసి వివరాలు సేకరించి, తిరిగి విచారణ చేయించి నష్టపరిహారం మంజూరు చేయమని కలెక్టర్లకు విజ్ఞాపన పత్రాలు సమర్పించాము. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దాదాపు 1900 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. సుమారు 700 మందికి మాత్రమే నష్టపరిహారం అందింది. ఈ విషయంలో మనం ఇంకా పనిచేయవలసి వుంది. ఈ మొత్తం విషయాన్ని వివరిస్తూ, ప్రభుత్వ లోపభూయిష్ట విధానాలు ఎత్తి చూపి మనం ఒక వివరమైన కరపత్రం వేసి రాష్ట్రం అంతా పంచాం. రైతాంగ సమస్యలపై ప్రభుత్వం నియమించిన జయతి ఘోష్ కమిషన్ ముందు మన వాదనలు విన్పించాం. రైతుల సమస్యలపై ఏ రైతు సంఘం సదస్సు/సభ నిర్వహించినా మనం విధిగా పాల్గొన్నాం. 2000 వ సంవత్సరంలో అనంతపూర్‌లో వేరుశనగ రైతులు పెద్ద మొత్తంలో ఆత్మహత్యలు చేసుకున్నారు. కరువు ప్రపంచీకరణ, ప్రపంచ వాణిజ్య సంస్థ ఒప్పందాలలో భాగంగా దిగుమతైన పామోలిన్ నూనెగింజల వల్ల సమస్య ఎట్లా జటిలమయి అనంతపురం వేరుశనగ రైతుల్ని ఆత్మహత్యలకు పుసిగొలిపిందో అనంతపురం యూనిట్ వాళ్ళ నివేదికల ద్వారా బహిర్గత పరచారు.

రైతాంగ సమస్యలు రోజురోజుకు జటిలమౌతున్నాయి. డబ్ల్యుటిఓ రెండవ ఒప్పందం అమలులోకి రావడంతో ఇంకా పరిస్థితి క్లిష్టంగా తయారయే

పరిస్థితులు కనపడుతున్నాయి. ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్లోకి ప్రయివేట్ వ్యక్తుల్ని, సంస్థల్ని , విదేశీ సంస్థల్ని కూడా ఆహ్వానించాలనే ప్రయత్నంలో వుంది. జయతిఘోష్ కమిషన్ సూచనలకు భిన్నంగా ప్రభుత్వం ఈ దిశవైపు ఆలోచిస్తుంది. రైతుల సమస్యలపై మనం ఒక సమగ్రమైన ఆలోచన చేసి కార్యాచరణ తయారు చేసుకోవాలి.

**కరువు ఆహార భద్రత:** కరువు వల్ల ప్రజలు పడే ఇబ్బందుల్ని, ప్రభుత్వం చేసే కరువు సహాయక పనులు సరిగా ప్రజలకు చేరకపోవడంతో ప్రజలు ఎట్లా ఇబ్బందులకు గురౌతున్నారు, ఏ విధంగా జీవించే హక్కుకు భంగం వాటిల్లుతుందో మన సంస్థ ఎప్పటికప్పుడు విషయాలు సేకరించి ప్రభుత్వ దృష్టికి తెస్తూ వుంది. 2000 సంవత్సరంలో పది జిల్లాల్లో 95 గ్రామాలు పర్యటించి ప్రజలను కలిసి పరిస్థితిని ప్రభుత్వ దృష్టికి తేవడం జరిగింది. నల్గొండ జిల్లాలో 21 గ్రామాలు, వరంగల్‌లో 7 గ్రామాలు, ఆదిలాబాద్‌లో 14 గ్రామాలు, కర్నూలులో 9 గ్రామాలు, కడపలో 7 గ్రామాలు, అనంతపూర్‌లో 14 గ్రామాలు, ప్రకాశం జిల్లాలో 4 గ్రామాలు మరియు విశాఖ జిల్లాలో రెండు గ్రామాలు పర్యటించి విషయ సేకరణ చేసాము. మానవహక్కుల వేదిక ఏర్పడిననాటినుండి కరువు సమస్యను ఒక ప్రత్యేక అంశంగా తీసుకొని పనిచేస్తున్నాం. గత మూడు సంవత్సరాలలో రాష్ట్రంలో చాలా జిల్లాలు వర్షాభావ పరిస్థితికి గురైనాయి. గత సంవత్సరం 441 మండలాలు కరువు మండలాలుగా గుర్తిస్తే, ఈ సంవత్సరం 810 మండలాలు కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర మొత్తంలో 21% తక్కువ వర్షపాతం నమోదైంది. తెలంగాణాలో మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో, ప్రకాశం జిల్లాలో ఆకలి చావులు చాలా సంభవించాయి. 2001 సంవత్సరంలో పియుసిఎల్ రాజస్థాన్ శాఖవారు ఆకలి చావులపై వేసిన పిటీషన్‌పై ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులలో ఆహారపు హక్కుని గుర్తిస్తూ, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ధాన్యం సరఫరా చేయడంతోబాటు **అంత్యోదయ, మధ్యాహ్న భోజన పథకం, వృద్ధాప్య పింఛను, అన్నపూర్ణ పథకం, సమగ్ర శిశు అభివృద్ధి పథకం, గర్భిణీ స్త్రీలకు సహాయ పథకం, భర్తలు కోల్పోయిన స్త్రీలకు పెన్షన్**

**పథకాలను** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పటిష్టంగా అమలుపరచాలని, ఈ పథకాల పర్యవేక్షణ కోసం ఎ.సి. సక్సేనా, ఎస్.ఆర్. శంకరన్‌గార్లను కమీషనర్లుగా నియమించింది. ఈ కార్యక్రమంలో ఈ కమీషన్‌కు తోడ్పటానికి వివరాలు సేకరించడానికి కొందరు వ్యక్తులతో బాటు కొన్ని సంస్థలు పనిచేస్తున్నాయి. మన సంస్థకు చెందిన ఎమ్. కోదండ్‌రామ్‌ను, శంకరన్‌గారికి నివేదికలు తయారుచేయడంలో సహాయ పడటానికి కేంద్ర ప్రభుత్వం ఒక ఉత్తర్వు ద్వారా నియమించింది. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి కోదండరామ్ ఎప్పటి కప్పుడు నివేదికలు పంపిస్తున్నారు. కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆహార లేమి, ఆకలిచావులు కరువు పరిస్థితిని వివరిస్తూ, రైతాంగ సమస్యతోబాటు, మనం నిర్ధిష్టమైన సూచనలతో ఒక విజ్ఞప్తి పత్రాన్ని ముఖ్యమంత్రిని కలిసి ఇవ్వడం జరిగింది. మనం ఇచ్చిన సూచనలలో కొన్నిటిపై ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిందని తెలపడానికి సంతోషిస్తున్నాం.

**నిర్వాసితుల సమస్య:** ప్రభుత్వం చేపట్టే రోడ్డు వెడల్పు పనులు, ప్రాజెక్టుల నిర్మాణం, ఇతర కార్యక్రమాల వల్ల పెద్ద మొత్తంలో ప్రజలు నిర్వాసితు లౌతున్నారు. నిర్వాసితులు కావడం తగురీతిలో నష్టపరిహారం, పునర్ నివాసం పొందలేని పరిస్థితిని ప్రజల హక్కుల ఉల్లంఘనలో భాగంగా మన సంస్థ భావించి కార్యక్రమాలు నిర్వహిస్తుంది. చంద్రబాబు నాయుడు పాలనలో చాలా పెద్ద మొత్తంలో ప్రజలు నిర్వాసితులైనారు. నగరాల్లో రోడ్ల నిర్మాణం, ఫ్లై ఓవర్ నిర్మాణం, నగర ఆధునీకరణ వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. హైదరాబాద్‌లో శంషాబాద్ వద్ద అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం చేపట్టడం వల్ల మూడు గ్రామాలు ఖాళీ చేయవలసి వచ్చింది. ప్రయివేటు వ్యక్తుల వద్ద నుంచి కొనుగోలు చేసిన 3500 ఎకరాల భూమితోపాటు పేదలు అనుభవిస్తున్న 1500 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రభుత్వం సేకరించింది. తిరుపతి కొండపై యాత్రికుల సౌకర్యార్థం పేరుతో దాదాపు 200 చిన్నా చితక వ్యాపారస్థుల షాపుల్ని గృహాల్ని తొలగించారు. మద్దివలస ప్రాజెక్టు వల్ల దాదాపు 7 గ్రామాలు ముంపుకు గురైనాయి. ఈ అన్ని సంఘటనల్లో మన సంస్థ విషయ సేకరణ చేసి నివేదికలు విడుదల చేసాం. ప్రభుత్వంతో మాట్లాడి వాళ్ళకు సహాయం

కోసం ప్రయత్నం చేసాం. హైదరాబాద్ సికిందరాబాద్, విశాఖపట్టణం, విజయవాడ నగరాల్లో చాలా పెద్ద ఎత్తున పేదల గుడిసెల తొలగింపు, బస్తీల తరలింపు చర్యలు జరుగుతుంటాయి. జంటనగరాలలో నివాస హక్కులపై మాత్రమే ప్రత్యేకంగా పనిచేస్తున్న 'ఛత్రి' అనే స్వచ్ఛంద సంస్థ(ఎన్‌జివో కాదు), పేద ప్రజల గుడిసె హక్కుల సంఘం(విశాఖపట్నం)లతో కలిసి మనం పట్టణాల్లో బస్తీల తొలగింపు, మురికివాడల సమస్యలు, నివాసహక్కులపై కలసి పనిచేస్తున్నాం. హైదరాబాద్, విశాఖ మాస్టర్ ప్లాన్స్ (ముసాయిదా) ప్రకటించినప్పుడు మనం దాంట్లో కొన్ని అంశాలపై సూచనలు, కొన్ని అభ్యంతరాలు తెలపడం జరిగింది. జంటనగరాల కమిటీ ప్రత్యేకంగా 'నగరీకరణ-ప్రజల హక్కులు' అనే అంశంపై సభ కూడా నిర్వహించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మధ్యలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ (Rehabilitation and Resettlement)పై ఒక పాలసీ ప్రకటించింది. దీన్ని క్షుణ్ణంగా పరిశీలించవలసి వుంది.

**మతఘర్షణలు:** రాష్ట్రంలో మత ఘర్షణలు, కల్లోలాలు జరిగినప్పుడల్లా మనం విషయసేకరణ చేసి, క్షతగాత్రుల్ని పరామర్శించి, వాళ్ళకు ప్రభుత్వం నుంచి అందవలసిన సహాయం గురించి డిమాండ్ చేస్తూ వున్నాం. 2001వ సంవత్సరంలో హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జనం సమయంలో నూర్‌ఖాన్ బజార్ నుంచి వస్తున్న ఊరేగింపులో పాల్గొన్న వ్యక్తులు 12 ముస్లిం ఇండ్లపై అకారణంగా రాళ్ళువేసి తలుపులు, ఫర్నిచర్ పగులగొట్టినప్పుడు మనం మాత్రమే స్పందించి, వివరాలు సేకరించి వాళ్ళకు ప్రభుత్వం నుండి నష్టపరిహారం ఇప్పించే ప్రయత్నం చేసాం. మూడు సంవత్సరాల క్రితం మోడీ ప్రభుత్వం గుజరాత్‌లో ఒక పథకం ప్రకారం మారణకాండ జరిపి దాదాపు 1500 మంది ముస్లింలను హతమార్చింది. 22వేల వ్యాపార సంస్థలు, దుకాణాలు ధ్వంసం అయినాయి. దాదాపు 3500 కోట్ల రూపాయల ఆస్తినష్టం జరిగింది. దేశాన్ని కుదిపివేసిన ఈ సంఘటనపై అయిదు హక్కుల సంఘాలతోబాటు మన సంస్థ నుంచి కూడా ముగ్గురు సభ్యులు బృందంలో సభ్యులుగా 9రోజులు పర్యటించి విషయ సేకరణ చేసారు. 'గాంధీ గుజరాత్‌లో గాడ్సే రాజ్యం' పేరుతో ఒక పుస్తకాన్ని

ప్రచురించాం. గుజరాత్ సంఘటనలపై తెలుగులో వచ్చిన మొదటి పుస్తకంగా మన పుస్తకానికి మంచి ప్రాచుర్యం లభించింది. 10 జిల్లాల్లో గుజరాత్‌లో జరిగిన సంఘటనలపై సభలు నిర్వహించాం. రెండేళ్ళ క్రితం అక్టోబర్ 6న బాబ్రి మసీదు కూల్చివేతకు నిరసన దినం సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీలో జరిగిన ఘర్షణలపై ఇతర సంఘాలతో కలిసి విషయసేకరణ చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాము. దేశంలో ఎన్‌డిఏ పాలనలో హిందూత్వం ఎజెండా భారతదేశ లౌకికవాద స్ఫూర్తికి ఎంత హానిచేసిందో మనం ప్రత్యక్షంగా చూసాం. ఇంకా హిందూత్వ శక్తులు అసమాన వైవిధ్యం వున్న మన నాగరికతను నాశనం చేసే ప్రయత్నంలో వున్నట్టు స్పష్టంగా కనపడుతుంది. దేశంలో చట్టబద్ధ పాలననూ, ప్రాథమిక హక్కయిన మత స్వేచ్ఛను, లౌకికవాద స్ఫూర్తిని కాపాడడం కోసం మనలాంటి సంస్థలు చాలా కృషి చేయవలసి వుంది.

ముఠా సంస్కృతి వల్ల పేదప్రజలు హక్కులు కోల్పోవడం కాకుండా ప్రాణాలు కోల్పోవడం మనం రాయలసీమ జిల్లాల్లో చూసాం. ఒక విధంగా మూర్ఖసంస్కృతిగా కనిపించిన ఫ్యాక్షనిజం స్వాతంత్ర్యానంతరం నెలకొన్న రాజకీయ వ్యవస్థలో అత్యంత లాభదాయకమైన సంపాదన మార్గం అయింది. ఈ మార్పులతోబాటు ముఠాలలో చేరేవాళ్ళ నైజం కూడా శ్రమ చేసే రైతుల నుండి వృత్తిరౌడీలకు మారేసరికి సామాన్య ప్రజలపైన దౌర్జన్యాలు, దాదాగిరి, స్త్రీలపై అత్యాచారాలు ఫ్యాక్షన్లో భాగం అయినాయి. అయితే ముఠా రాజకీయాల్లో ఎక్కువగా బలైంది బలహీనవర్గాల ప్రజలు. ముఠానాయకులను ఆశ్రయిస్తే బతుకు గడుస్తుందనుకునే కొందరు ప్రజలు. తెలుగుదేశం పాలనలో కడప, కర్నూలు జిల్లాల్లో ఫ్యాక్షనిస్టుల హత్యాకాండలో కిరాయి హంతకులుగా పాల్గొన్నారంటూ దాదాపు 30 మందిని పోలీసులు ఎన్‌కౌంటర్ల పేరిట చంపారు.

ఈ విషయంపై అనంతపూర్ యూనిట్ కరపత్రం వేసి చాలా వాస్తవాలు బయటకు తెచ్చింది.

**అసమాన అభివృద్ధి హక్కుల ఉద్యమం:** పాలకుల వివక్ష వల్ల రాష్ట్రంలో గత 40 ఏళ్లుగా తెలంగాణ జిల్లాల్లో నిరసన ధోరణులు వ్యక్తమై, చివరకు ఆ

నిరసన ఒక ఆత్మగౌరవ ఆరాటంగా, తమ అస్తిత్వానికి చెందిన వుద్యమంగా రూపుదిద్దుకుంది. తెలంగాణా ప్రాంతంలో, ఉల్లుబికిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని, రాయలసీమ, ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని మన సంస్థ హక్కుల చట్రంలోంచి చూసి ఆ ఉద్యమాలు లేవనెత్తిన అంశాలపై అభిప్రాయాలు చెప్తూ వచ్చింది. తెలంగాణా వెనుకబాటుతనంపై తెలంగాణా జిల్లాల్లోనే కాకుండా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో కూడా సమావేశాలు నిర్వహించాం. తెలంగాణాతోపాటు ఉత్తరాంధ్ర సమస్యలు, రాయలసీమ వెనకబాటుతనం మొదలైన అంశాలను చర్చకు పెట్టాం. ప్రభుత్వం జారీచేసిన 610 జీవో ఉల్లంఘన జరిగిన తీరుపై దాని అమలు విఫలం కావడంతో కోల్పోయిన హక్కుల అంశాల్ని కరపత్రం వేసి వివరించాం. దాదపు అన్ని తెలంగాణా జిల్లాల్లోనూ 610 జీవోపై సమావేశాలు నిర్వహించాం. న్యాయపరంగా పొందవలసిన అభివృద్ధి ఫలాలు పొంద లేకపోవడం, అభివృద్ధి చెందిన ప్రాంతాలు, అభివృద్ధికి దూరంగా వున్న ప్రాంతాలను అణచివేయడానికి పర్యవసానంగా, హక్కులు సాధించుకోవడానికి జరిగే ఆందోళనలను మన వేదిక హక్కుల ఆకాంక్షలో భాగంగానే చూస్తున్నది. ప్రత్యేక తెలంగాణా వుద్యమాన్ని, రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రజల అభివృద్ధి కోసం పెల్లుబుకుతున్న నిరసనను కూడా మన వేదిక హక్కుల చట్రంలోంచే చూస్తున్నది.

**అఫ్ఘనిస్తాన్, ఇరాక్‌లపై అమెరికా దాడి:** ప్రపంచంలో ఎక్కడయినా ఏ మూలనయినా తన ప్రయోజనాలకు హాని కలిగించగల రాజకీయ వ్యవస్థగానీ, ప్రభుత్వంగానీ, ఉద్యమంగానీ ఉన్నట్టయితే ఏ నీతీ పాటించకుండా, ఏ నియమాన్ని గౌరవించకుండా స్థానిక ప్రజల ఇష్టాయిష్టాలతో కష్టనష్టాలతో నిమిత్తం లేకుండా దానిని తొలగించి వేయడం, అణచివేయడం, తన అదుపులోనికి తెచ్చుకోవడం ప్రపంచ పోలీసును అని చెప్పుకుంటున్న అమెరికా రాజకీయనీతి రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత జరిగిన దాదాపు 150 చిన్న, చితక యుద్ధాలలో అమెరికా జోక్యం వుందనే వాస్తవం మనం గమనించాం. ఈ రాజనీతి కొనసాగింపే అఫ్ఘనిస్తాన్‌పై, ఇరాక్‌పైన అమెరికాదాడి. అమెరికా

రాజనీతిని విశ్లేషిస్తూ హక్కుల్ని కాపాడటం, టెర్రరిజం అంతం చేయడం తన బాధ్యత అని చెప్పుకుంటూ దేశాల సార్వభౌమత్వాలను అమెరికా ఎట్లా కాలరాస్తుందో వివరిస్తూ కరపత్రాలు వేసాం. యుద్ధానికి వ్యతిరేకంగా దాదాపు అన్ని జిల్లాలో సమావేశాలు నిర్వహించాం. హైదరాబాద్‌లో యుద్ధానికి వ్యతిరేకంగా జరిగిన అన్ని ర్యాలీలలో పాల్గొన్నాం. 2001లో ఇరాక్‌పై దాడి జరిగినప్పుడు 'యుద్ధసత్యాలు' పేరుతో ఒక ప్రత్యేక బులెటిన్ కూడా ప్రచురించాం.

**ఎన్‌కౌంటర్లు, లాకప్ మరణాలు:**

1998 సంవత్సరంలో రికార్డు స్థాయిలో ఎన్‌కౌంటర్లు జరిగాయి. అప్పటినుంచి మొదలుకొని 2004 సంవత్సరము వచ్చేసరికి ఎన్‌కౌంటర్ హత్యలు విపరీతంగా పెరిగాయి. మన వేదిక దాదాపు అన్ని ఎన్‌కౌంటర్ల విషయంలో నిజనిర్ధారణ చేసి విషయాలు పత్రికలకు చెబుతున్నది. కొన్ని కేసుల్లో జాతీయ మానవహక్కుల కమీషన్‌కు ఫిర్యాదు కూడా చేయడం జరిగింది. అయితే మానవహక్కుల కమీషన్ చాలా రొటీన్‌గా మనం పంపిన ఫిర్యాదును రాష్ట్ర ప్రభుత్వానికి పంపి రాష్ట్ర ప్రభుత్వం నుండి వచ్చిన జవాబును మనలాంటి సంస్థలకు పంపుతున్నది. ఆ కమీషన్ ఇదివరకు చెప్పినట్లు ప్రతీ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై హత్యకేసును నమోదు చేయడం ఎప్పుడూ జరగలేదు. చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో నక్సలైట్లకు మాత్రమే పరిమితం అయిన ఎన్‌కౌంటర్లు ఇతర వర్గాలపై కూడా ఒక పద్ధతిగా మొదలైంది. కర్నూలు, కడప జిల్లాల్లో కిరాయి హంతకులుగా పాల్గొంటున్నారంటూ దాదాపు 30 మందిని పోలీసు ఎన్‌కౌంటర్ల పేరిట చంపారు. ఈ ప్రాంతంలో ముఠానాయకులు నూటికి 99 శాతం రెడ్డి కులస్థులు కాగా ఎన్‌కౌంటర్ల పేరిట చంపబడ్డ కిరాయి మనుషులంతా దాదాపు దిగువ కులాలకు చెందినవారే. అయితే పోలీసులు వీళ్ళను హత్యచేసి ఫ్యాక్షనిజాన్నిఅంతం చేస్తున్నామని ప్రకటిస్తూ వస్తున్నారు. 'వృత్తి నేరస్థులు'గా పోలీసులు భావించినవారిని కాల్చిచంపడం కూడా తెలుగుదేశం ప్రభుత్వంలో ఒక ఆనవాయితీగా మారింది. రంగారెడ్డి, ప్రకాశం జిల్లాల్లోనూ

విజయవాడ పట్టణంలోనూ ఇటువంటి హత్యలు మొత్తం 30కి పైగా జరిగాయి. దాదాపు ఎన్‌కౌంటర్ కేసులన్నింటిలో ఆ వ్యక్తుల్ని అరెస్టు చేసే అవకాశం ఉన్నా, ఆత్మరక్షణ కోసం కాల్పులు జరపవలసి వచ్చిందని పోలీసులు చెబుతూ వస్తున్నారు. కస్టడీలోకి తీసుకున్న కొన్ని కేసుల్లో కోర్టు ముందు లేక మెజిస్ట్రేట్ ముందు హాజరుపెట్టి తీసుకుపోయే క్రమంలో కాల్చి చంపారు. విజయవాడలో అప్పటి పోలీసు కమీషనర్‌గా ఉన్న సురేంద్రబాబు స్వయంగా చొరవ తీసుకుని బుడా శంకర్ అనే వ్యక్తిని పోలీస్ స్టేషన్‌లో చంపి లాకప్‌లో 'ఎన్‌కౌంటర్ కథ' అల్లిన విషయం మనం చూశాం. కర్నూలులో సీతారామాంజనేయులు ఎస్‌పిగా ఉన్న రోజుల్లో జైలులో రిమాండ్‌లో ఉన్న ముగ్గురు 'కిరాయి హంతకులను' అలంపూర్ కోర్టులో హాజరు పెట్టడానికని తీసుకుపోతూ పోలీసులు వ్యాన్ నుండి దింపి చంపారు. సీతారామాంజనేయులు, సురేంద్రబాబుల విషయంలో హక్కుల సంఘాలతోపాటు న్యాయవాదుల సంఘాలు కూడా చాలా ఆందోళన చేశాయి. అయినా ప్రభుత్వం ఈ అధికారులపై వచ్చిన ఆరోపణలపై ఎటువంటి విచారణ చేయలేదు.

అరెస్టు చేసినపుడు పాటించవలసిన నియమాల విషయంలో సుప్రీంకోర్టు డి.కె. బాసు కేసులో కొన్ని మార్గదర్శక సూత్రాలు జారీ చేయడం మనకు తెలుసు. అయినా ఇప్పటికీ పోలీస్ స్టేషన్‌లో ఈ సూత్రాలను పాటించడం లేదు. మూడు సంవత్సరాల క్రితం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టు సూచించిన మార్గదర్శక సూత్రాలను పర్యవేక్షించడానికి ఒక రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో మానవ హక్కుల కమిటీని ఏర్పరచింది. ఈ కమిటి చాలా కేసుల్లో తాను స్వయంగా పేపర్లలో వచ్చిన వార్తల ఆధారంగా, కమిటీకి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించడం జరుగుతుంది. కొన్ని కేసుల్లో లాకప్ హత్యల్ని నిర్ధారించి బాధ్యులైన పోలీసు అధికార్లపై చర్య తీసుకోవాలని బాధితుడి కుటుంబాలకి నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయడం జరిగింది. కొన్ని కేసుల్లో నష్టపరిహారం అయితే చెల్లించారు గాని మరణానికి బాధ్యుడయిన పోలీసు అధికారిపై విచారణకుగాని, చర్యకు గాని ప్రభుత్వం పూనుకోవడం లేదు. మనం

నిజనిర్ధారణ చేసి విషయాలను బయటికి తెస్తున్నాం గాని దోషులైన పోలీసుల విషయంలో ప్రభుత్వంపై వత్తిడి పెట్టలేక పోతున్నాం. ఈ విషయంలో నిర్దిష్టంగా ఎట్లా ముందుకు పోవాలో మనం ఆలోచించుకోవలసి ఉంది.

**ప్రభుత్వానికి, నక్సలైట్లకి మధ్య చర్చలు విఫలం-ప్రస్తుత పరిస్థితి:**

నక్సలైట్లకి, ప్రభుత్వానికి చర్చలు జరగాలని పౌరస్పందన వేదిక చేసిన కృషి వలన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం 2002 సంవత్సరంలో చర్చలు మొదలుపెట్టినట్లే పెట్టి నిలిపివేసింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీ, పౌరస్పందన వేదిక ప్రయత్నం, హక్కుల సంఘాల, ప్రజల అభీష్టం మేరకు చర్చలు జరిగిన ప్రక్రియను చూశాం. ఈ సందర్భంలో ఆయుధాల అంశం ప్రతిబంధకంగా తయారైంది. ఈ సమయంలో ఆయుధాల విషయం ప్రక్కనపెట్టి ప్రజల సమస్యపై చర్చలు జరపాలని మన వేదికతోపాటు ఇంకొన్ని సంస్థలు కూడా అభిప్రాయపడ్డాయి. చివరకు చర్చలు ప్రారంభం అయి కొంత దూరం వచ్చి మళ్ళీ భగ్నమయ్యాయి. భగ్నానికి ప్రభుత్వమే ముఖ్యకారణమని భావించినా, తరువాత జరిగిన పరిణామాలు చాలా ఆందోళనకరంగా మారాయి. కాల్పుల విరమణ లేకపోవడం అంటే కాల్చడమే. ప్రధానంగా పోలీసులు నక్సలైట్లు చర్య ప్రతిచర్యలలో నిమగ్నమయ్యారు. రెండువైపులా ప్రాణనష్టం, అభద్రత, అమాయకులు బలికావడం జరుగుతూనే ఉంది. చర్చలు ప్రారంభానికి ముందు ప్రభుత్వం నియమించిన పర్యవేక్షక కమిటీ తన పాత్ర ఏమీ లేకుండా ప్రభుత్వం నుండి ఖచ్చితమైన ఆదేశాలు లేక ప్రేక్షక పాత్ర వహించింది. దీనికి నిరసనగా నేను, బాలగోపాల్ కమిటీకి రాజీనామా కూడా చేశాం. చర్చలు జరిగితే హింస స్థాయి కొంచెం తగ్గుతుందని ప్రభుత్వం తన పరిపాలన గ్రామస్థాయిదాకా తీసుకుపోతుందని ప్రజలు ఎవరికీ భయపడకుండా స్వేచ్ఛగా బ్రతకగలరని మనం అనుకున్నాం. పోలీసులు, మావోయిస్టులు, జనశక్తి దళాలను, కార్యకర్తలను మట్టుబెట్టడమే పనిగా పెట్టుకున్నారు. నక్సలైట్ పార్టీలు కూడా ప్రతి చర్యగా ఇన్‌ఫార్మర్లను అపుడప్పుడు పోలీసులను హతమారుస్తున్నాయి. ఇరుపక్షాలు పూర్తిగా వైరి వైఖరి తీసుకున్నాయి. నక్సలైట్లు బస్సు దహనాలను

ప్రజలను ఇబ్బందులకు గురిచేసే చర్యలను, ఇన్‌ఫార్మర్ల పేరుతో చేసే హత్యల్ని మన వేదిక ఖండించింది కూడా. నల్లగొండలో జరిగిన ముగ్గురు ఇన్‌ఫార్మర్ల విషయంలో విషయసేకరణ కూడా చేశాం. ఇప్పటికి రాజకీయోద్యమాలను రాజకీయంగానే ఎదుర్కోవాలని నక్సలైట్లు లేవనెత్తే సమస్యల్ని పరిష్కరించే దిశగా ప్రభుత్వం ముందుకు పోవాలని చట్టబద్ధ పాలన, ప్రజాసంక్షేమం, ప్రభుత్వాల ధ్యేయంగా ఉండాలని మన వేదిక భావిస్తుంది. మళ్ళీ ప్రశాంత వాతావరణం ఏర్పరచడానికి మనం చేసే ప్రయత్నాల విషయంలో ఈ సభల సందర్భంగా ఆలోచించి ఒక నిర్ణయానికి రావలసి వుంది.

**మహిళల సమస్యలు:**

రాజస్థాన్‌లో సామాజిక కార్యకర్తగా పనిచేస్తున్న ఒక స్త్రీపై కొందరు దుండగులు జరిపిన సామూహిక అత్యాచారం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. స్త్రీలకు పనిచేసే స్థలంలో ఉన్న ప్రాథమిక హక్కులను భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14,19 మరియు 21 ప్రస్తావించింది. రాజస్థాన్‌లో జరిగిన సంఘటనపై కొంతమంది సామాజిక కార్యకర్తలు సుప్రీంకోర్టులో ఒక రిట్ పిటీషన్ వేశారు. ఈ కేసును పరిశీలించిన సుప్రీంకోర్టు ఉద్యోగినులపై పని స్థలాల్లో జరిగే లైంగిక హింస నిరోధించడానికి, జరిగినపుడు విచారణ చేయడానికి కొన్ని మార్గదర్శక సూత్రాలు యజమానులకు, సంస్థలకు సూచించింది. ఈ విషయంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం ఒక సర్క్యులర్‌ను పంపింది. మన రాష్ట్ర ప్రభుత్వం ఈ సర్క్యులర్‌ను అమలు పరచడం విషయంలో కొంచెం ఆలస్యం చేసింది. మన సంస్థ ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాధికార్లతో మాట్లాడటమే కాక, సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాల విషయాల్ని ఆఫీసుల్లో యూనియన్‌లకు, మహిళా యూనిట్లకు తెలిపే కార్యక్రమం తీసుకుంది. మహిళలపై వేధింపులు, వరకట్నపు హత్యలు చాలా మామూలైపోయాయి. అప్పుడప్పుడు మన జిల్లా యూనిట్లు కొన్ని సంఘటనల్లో జోక్యం చేసుకొని, ఆందోళనలు చేయడం జరిగింది. వరంగల్, కర్నూలు, అనంతపురం, నెల్లూరు జిల్లాలు, జంటనగరాల యూనిట్ కొన్ని కేసుల్లో ప్రతిస్పందించాయి. కాని ప్రత్యేకంగా మహిళపై అత్యాచారాలు, అసహజ

మరణాలు, మహిళలపై హింస విషయంలో ప్రత్యేకమైన కార్యక్రమాలేవి చేపట్టలేదు.

**మన సంస్థ చొరవతో ప్రారంభించిన ఆందోళనలు:**

**1. అణ్వాయుధ వ్యతిరేక వేదిక.** ప్రపంచంలో టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ, సాంకేతిక పరిజ్ఞానాన్ని మానవ వినాశనానికి వాడుకోవడం పెరిగిపోతుంది. ప్రపంచంలో చాలా దేశాల అణ్వాయుధాల కోసం వేటాడటం, తమ ఇరుగు పొరుగు దేశాలతో ప్రమాదం ముంచుకొస్తుందని ఆసియాలోని చిన్న దేశాలు కూడా సైనిక బలగాలు పెంచుకొని, అణ్వాయుధాలు సమకూర్చుకొంటూ, ప్రజల అవసరాలని, సంక్షేమాన్ని పక్కన పెడ్తున్నాయి. దీని వెనక ఆయుధాలు తయారుచేస్తున్న పెద్ద దేశాల కుట్ర వుంది. ఈ అంశాలన్నీ వివరిస్తూ వరంగల్, హైదరాబాద్, మిర్యాలగూడలో సమావేశాలు నిర్వహించాం. జాతీయ స్థాయిలో 'అణ్వాయుధాల వ్యతిరేక వుద్యమం' ఒకటి పనిచేస్తుంది. రాష్ట్రస్థాయిలో మనం ప్రజాతంత్రవాదుల్ని, హేతువాదుల్ని, శాస్త్రజ్ఞుల్ని సమీకరించి ఒక ప్రత్యేక సంస్థను ఏర్పరచాలని ప్రయత్నించాం. అందులో భాగంగానే 'అణ్వాయుధాలు-మనం' అనే పుస్తకాన్ని ప్రచురించాం. ఈ విషయంలో చొరవ చూపమని మధుసూదన్‌రాజుగార్ని కోరాం. కాని మనం ఆశించినట్టు ఒక ప్రత్యేక వేదికనేర్పరచ లేకపోయాం.

**2. కృష్ణాజలాల పున: పంపిణీ ఉద్యమం:** ప్రకృతి వనరులు అన్ని ప్రాంతాలకు అందుబాటులో వుండటం, అందుబాటులో లేనప్పుడు అందించడం ప్రభుత్వాల బాధ్యత. కృష్ణానది నీటితో కోస్తా జిల్లాలు వాడుకుంటున్న దానిలో గణనీయమైన భాగాన్ని నది ఎగువన వున్న దక్షిణ తెలంగాణా, రాయలసీమ జిల్లాలకు బదలాయించనిదే ఆ జిల్లాలకు కరువు సమస్య తీరదన్నది అందరు ఎరిగిన విషయమే. 2000 సంవత్సరం మే నెలలో బచావత్ ట్రిబ్యునల్ గడువు ముగుస్తుండడం వల్ల ఇంకొక ట్రిబ్యునల్ ఏర్పరచితే దీనిముందు న్యాయబద్ధమైన ప్రతిపాదనలు పెట్టాలంటే ముందు మన రాష్ట్రంలో ప్రాంతాల వారిగా పంపిణీకి సంబంధించిన న్యాయసూత్రాలను ఏర్పరచుకొని, వాటిని ట్రిబ్యునల్ ప్రతిపాదనల్లో భాగం చేయడానికి, ఒక చర్చ జరపడానికి మన

సంస్థ, మహబూబ్‌నగర్ కరువు పోరాట సమితి సహకారంతో కృష్ణానదీ జలాల పునః పంపిణీ ఉద్యమం పేరుతో ఒక కార్యక్రమం ప్రారంభించాం. దక్షిణ తెలంగాణ జిల్లాలు, రాయలసీమ జిల్లాలు తిరిగి ప్రజాభిప్రాయం సేకరించడం జరిగింది. గద్వాలలో, హైదరాబాద్‌లో సదస్సులు నిర్వహించడం జరిగింది. ఈ ఉద్యమం తరపున రెండు కరపత్రాలు మన సహకారంతో ముద్రించడం జరిగింది. ఈ ఉద్యమంలో భాగస్వాములైన సంస్థలన్నింటిని సమావేశపరచి భవిష్యత్ కార్యక్రమం రూపొందించుకోవలసి వుంది.

**3. విజన్ 2020పై ప్రచార ఉద్యమం:** చంద్రబాబు ప్రభుత్వం 1999 జనవరి 26న విజన్ 2020 పేరుతో ప్రభుత్వ విధానాలకు సంబంధించిన ఒక డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. ఆయనగారు మలేషియా పర్యటించి వచ్చి, ప్రపంచ బ్యాంకుతో చర్చలు జరిపి ఒక అభివృద్ధి దృశ్యాన్ని మన ముందు వుంచాడు. రాజ్యం సంక్షేమ రంగాన్నుండి ఎట్లా దూరం కావచ్చో, ప్రజలకు జీవనాధారాలయిన వనరులన్ని ఎట్లా ప్రయివేటీకరించి, ప్రజల్ని పూర్తిగా ప్రయివేట్ రంగంలోకి తోసివేయదలచుకుందో ఈ డాక్యుమెంట్‌లో మనకు దృశ్యం కనపడుతుంది. ఈ డాక్యుమెంట్‌పై అందరికంటె ముందు మన సంస్థ 'ఎండమావి 2020' పేరుతో ఒక విమర్శనాత్మక పుస్తకాన్ని ప్రచురించాం. ఒక కరపత్రం వేసి చాలా జిల్లాల్లో సమావేశాలు నిర్వహించాం. మనం స్పందించిన తర్వాతనే ఇతర ప్రజాసంఘాలు, సంస్థలు, ప్రతిపక్ష పార్టీలు దీనిపై మాట్లాడటం మొదలుపెట్టాయి. కొద్దిరోజుల్లోనే చంద్రబాబు అభివృద్ధి దృక్పథానికి వ్యతిరేకంగా ఉద్యమం మొదలైంది.

**మన సంస్థ ప్రత్యేకంగా చేపట్టిన కార్యక్రమాలు:**

1. విద్యుచ్ఛక్తి రేట్ల పెరుగుదలపై 'ఛలో అసెంబ్లీకి' పిలుపుపై వెళ్తున్న ప్రజలపై 28 ఆగస్టు 2000న ఫైరింగ్ జరిగింది. నలుగురు మరణించారు. చాలామంది గాయపడ్డారు. ప్రభుత్వం ఈ సంఘటనపై న్యాయవిచారణకు అంగీకరించలేదు. తొమ్మిది వామపక్షాల ఫ్రంట్ సహాయంతో మన సంస్థ భారత ప్రజల మానవ హక్కుల ట్రిబ్యునల్ (Indian People's Human Rights Tribunal) చేత ఈ కాల్పులపై విచారణ జరిపించాం. ఈ ట్రిబ్యునల్

నివేదికను పుస్తకరూపంలో తేవాలనుకున్నాం. కాని వీలుకాలేదు.

2. నల్లగొండ జిల్లాలో యురేనియమ్ తవ్వకాలు ప్రజలకు ఎంత ప్రమాదకరమో వివరిస్తూ కరపత్రం వేసాం. రెండుసార్లు ఈ విషయంలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్నాం.

3. ఎస్సి, ఎస్టిలపై జరిగే అత్యాచారాలు, అన్ని రకాల వివక్షలను బహిర్గతం చేయడానికి జిల్లాలు పర్యటించి పొన్నయ్య కమీషన్‌కు వివరమైన నివేదిక సూచనతో బాటు సమర్పించాం.

4. రెండుసార్లు రాష్ట్ర అసెంబ్లీకి, పార్లమెంటుకు ఎన్నికలు జరిగినప్పుడు, ఎలక్షన్లలో పోటీ చేసే అభ్యర్థులకు ప్రశ్నావళి రూపంలో ప్రజల తరపున ప్రజల సమస్యలపై కరపత్రం వేసి పంచాం. ఈ కరపత్రాన్ని చాలా ప్రాంతాల్లో లోకసత్తా నిర్వహించే 'అభ్యర్థితో ముఖాముఖి' కార్యక్రమంలో ప్రజలు చదవడం కూడా జరిగింది.

5. ఎన్నికల రోజు టీమ్‌లుగా వెళ్ళి ఎలక్షన్లు నిర్వహిస్తున్న తీరుపై, ప్రజలు ఓటు స్వేచ్ఛగా వేస్తున్నారా లేదా అనే అంశాలు పరిశీలించడానికి 'ఎలక్షన్ వాచ్' నిర్వహించి, నివేదికలు తయారుచేసి పత్రికలకు విడుదల చేసాం.

6. ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేషన్ కమీషన్ ముందు ప్రతి సంవత్సరం ప్రజలు విద్యుచ్ఛక్తి విషయంలో ఎదుర్కొనే విషయాలు, సమస్యలపై వాదనలు తప్పనిసరిగా వినిపిస్తున్నాం.

7. బి.సి. కమీషన్ ముందు, ముస్లింల రిజర్వేషన్ అంశాలపై వాదన వినిపించాం.

8. వ్యవసాయ రంగంలో సంక్షోభంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పరచిన జయతిఘోష్ కమీషన్ ముందు ప్రతిపాదనలు చేసాం.

**ఇతర సంస్థలతో కలిపి చేసిన కార్యక్రమాలు:**

**ఆసియా సామాజిక వేదిక(ASIAN SOCIAL FORUM):**

2003, జనవరి 2 నుండి 7 వరకు ఆసియా సామాజిక వేదిక కార్యక్రమాలు హైదరాబాద్‌లో జరిగాయి. ప్రపంచ ఆర్థిక వేదిక జరుగుతున్న సమయంలోనే దానికి వ్యతిరేకంగా ప్రపంచ సామాజిక వేదిక పేరుతో ఒక ఉద్యమం మొదలైంది. ప్రపంచ బ్యాంకు విధానాలు, నూతన ఆర్థిక

సంస్కరణలు, ప్రయివేటీకరణ పాలసీలకు నిరసనగా కొత్త పద్దతుల్లో గొంతులు వినిపించడానికి ఏర్పడ్డ వేదిక ఇది. ఈ సామాజిక నిరసన ప్రక్రియలో భాగంగా హైదరాబాదులో ఆసియా సామాజిక వేదిక సభలు జరిగాయి. దాదాపు 15వేల మంది డెలిగేట్సు 840 సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. ఈ సభల నిర్వహణలో కొన్ని బాధ్యతలు మనం తీసుకొని పనిచేయడం జరిగింది. ఈ ప్రక్రియలో యన్.జి.ఓ సంఘాలు వాళ్ళకు నిధిని సమకూర్చే సంస్థలు ఎక్కువ పాత్ర వహిస్తున్నాయి కాబట్టి అందులో పాల్గొనడం సరి అయింది కాదని కొన్ని సంస్థలు దాన్ని బహిష్కరించాయి కూడా. కాని మనం ఈ అంశాల జోలికి పోకుండా, ఒక పెద్ద నిరసన కార్యక్రమం జరుగుతున్నప్పుడు హక్కుల సంఘంగా మన బాధ్యత నిర్వహించాలని మనం పాల్గొన్నాం. క్రియాశీలకంగా పాల్గొన్న మన సభ్యులు ఎవ్వరు కూడా డబ్బు రూపేణా ఏ సంస్థ నుండి కూడా సహాయం తీసుకోలేదు.

**సర్కారీ కిరాయి ముఠాలకు వ్యతిరేకంగా ఉద్యమం:**

ఒకనాడు పీపుల్స్‌వార్ పార్టీలో పనిచేసిన వ్యక్తులు పోలీసులకు సరెండర్ అయిన తరువాత వాళ్ళు దిగజారిపోయి కిరాయి హంతకులుగా మారారు. మారిన మాజీ నక్సలైట్లకు ఆయుధాలు, రక్షణ కల్పించి వారి ఆగడాలను పోలీసులు కాపాడుతూ వారిచేత వివిధ ఉద్యమ సంస్థల బాధ్యులను చంపించడం లేదా వారు తమ వ్యక్తిగత కక్ష తీర్చుకోవడానికి చంపుతుంటే చట్టం బారిన పడకుండా వారిని రక్షించడం పోలీసు వ్యవస్థ ఒక పాలసీగా పెట్టుకుంది. పౌరహక్కుల సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పురుషోత్తంతో మొదలుకొని ఆజం అలీని హత్య గావించి చాలామంది కార్యకర్తలను బెదిరించడం మొదలుపెట్టారు. ఈ సర్కారీ నేరస్థులను ఎవరూ ప్రశ్నించే పరిస్థితి లేకుండె. ఈ విషయాలని సమాజం దృష్టికి తెచ్చి ప్రభుత్వం మీద ఒత్తిడి తేవడానికి ఎపిసిఎల్‌సి, ఒపిడిఆర్, పియుసియల్ సంస్థలతో కలిసి ఒక రాష్ట్ర స్థాయి సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించడం జరిగింది. ఇటువంటి ముఠాలను చేరదీసి వారి నేరాలకు అభయం ఇచ్చి ఉద్యమాలపైన, తమ పాలనకు వ్యతిరేకమైన వారిపై ప్రయోగించే ప్రభుత్వ వ్యూహాన్ని అత్యంత

ప్రమాదకరమైన విషయంగా మనం గుర్తించాలి. తరువాత కాలంలో ఎపిసియల్‌సి బాధ్యుడు లక్ష్మణ్‌ను భయభ్రాంతులకు గురిచేయడం, మహబూబ్‌నగర్‌లో బిచ్చారెడ్డిని కారుతో ఢీకొట్టి ఆక్సిడెంట్ చేయడం జరిగింది. ఈ నేరగాళ్ళ చరిత్రను, ప్రభుత్వం యొక్క పాత్రను ఒక పుస్తకంగా వేసి దేశమంతా ప్రచారం చేయాలని నిర్ణయం జరిగింది కాని ఆ ప్రయత్నం ముందుకు సాగలేదు.

**సింగరేణిని రక్షించుకుందాం ఉద్యమం:**

తెలంగాణాలో అతి పెద్ద పరిశ్రమగా కొన్ని లక్షల కార్మికులకు జీవనాధారం చూపుతున్న సింగరేణి గనుల పరిశ్రమ రోజురోజుకు సంక్షోభంలోకి నెట్టివేయబడుతున్న వైనాన్ని మన సంఘం అర్థం చేసుకుంది. సంస్థ నష్టాలకు కారణం కార్మికులేనని యాజమాన్యం అవలంభిస్తున్న తప్పుడు విధానాలు వారిలో లంచగొండితనం మొదలైన విషయాలు బహిర్గతం కాకుండా ప్రయత్నాలు జరిగాయి. మన వేదిక అక్కడి కార్మిక సంఘాలతో, మిత్రులతో మాట్లాడి విషయాలు సేకరించి సేవ్ సింగరేణి పేరుతో ఒక పుస్తక ప్రచురణకి దోహదం చేసింది. గనులున్న ప్రాంతాలలో సమావేశాలు జరిపి అసలు విషయాలను బయటపెట్టాం. ఈ మొత్తం ప్రక్రియ ఒక స్వతంత్రమైన కార్మిక హక్కుల ఆందోళనలకు నాందీ అవుతుందని ఆశించాం, కాని అనుకున్నట్టుగానే సేవ్ సింగరేణి ఉద్యమం ముందుకు సాగలేదు.

**మరణశిక్ష రద్దుకు ఉద్యమం:**

నాగరిక సమాజాలు ఏర్పడ్డ తరువాత నేరానికి శిక్ష వేసే సమయంలో చాలా మార్పులు వచ్చాయి. చాలా దేశాలు మరణదండనను రద్దు చేసాయి. రద్దుచేయని 105 ప్రపంచ దేశాలలో మనదేశం కూడా వుంది. కొన్ని దేశాలు రద్దుచేయకున్నా అమలు చేయడం మానుకున్నాయి. భారతదేశంలో మరణశిక్షను రద్దు చేయాలని హక్కుల సంఘాలు డిమాండ్ చేస్తూ వచ్చాయి. అయితే ఇది ఒక ఉద్యమంగా రావాలని ఆంధ్రప్రదేశ్‌లో 1999 సంవత్సరంలో ఒక ప్రయత్నం మొదలైంది. కొన్ని ప్రజాసంఘాలు హక్కుల సంఘాలతో కలిసి కార్యక్రమాలు చేసాం. కరపత్రాలు ముద్రించాం. కాని ఈ ప్రయత్నం

ఉద్యమ రూపం తీసుకుని ముందుకు సాగలేదు. ఈ విషయంపై మళ్ళీ ఒకసారి ఆలోచన చేయవలసి ఉంది.

**నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు:**

అన్నిరకాల నల్లచట్టాలకు వ్యతిరేకంగా మన వేదిక ఉద్యమాల్లో పాల్గొంటూ వస్తుంది. 1995లో తాత్కాలికంగా ఎత్తివేసిన టాడా చట్టం కొత్తరూపంలో రాబోతున్నదనే వాస్తవాన్ని మనం కరపత్రం వేసి చెప్పాం. పాత 'టాడా' లో వున్న అభ్యంతరకర విషయాలు, రాబోయే చట్టంలో రూపుదిద్దుకున్న అంశాల్ని సభలు పెట్టి వివరించాం. ఆ కొత్త చట్టం పోటా పేరుతో వచ్చినప్పుడు దాని దుష్ప్రభావాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రం ముద్రించాం. పోటాకు వ్యతిరేకంగా జరిగిన అన్ని రకాల ఆందోళనల్లో పాల్గొన్నాం. 'పోటా' ఎత్తివేసినప్పటికి ఇప్పటికి రాష్ట్రంలో, దేశంలో చాలా అప్రజాస్వామిక చట్టాలు అమలులో వున్నాయి. వాటి గురించి మనం ఆలోచించవలసి వుంది.

**మద్యపాన వ్యతిరేక కమిటీ:**

చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే మద్యపాన నిషేధం ఎత్తివేసారు. రాష్ట్ర ఆదాయాన్ని పెంచడానికి సరసమైన ధరకు బ్రాండీ అందించే పద్ధతి, బ్రాండీ షాపుల లైసెన్సింగ్ విధానాలలో మార్పులు తెచ్చాడు. ఒక షాపుకు అనుబంధంగా వరుసగా బెల్టు షాపులు నడుపుకునే పద్ధతిని ప్రవేశపెట్టాడు. దీని ప్రభావం క్రింది తరగతులపై, పేదవర్గాలపై విపరీతంగా పడింది. ఒకప్పుడు పోరాటం చేసి మద్యపాన నిషేధాన్ని సాధించుకున్న స్త్రీలు, ఈ పద్ధతి వల్ల ఎక్కువగా నష్టపోయారు. బెల్టుషాపులు రద్దు చేసి, అక్రమ మద్య విక్రయం నియంత్రించి, మద్యపాన నిషేధం దిశగా ఆలోచించడానికి మద్యపాన వ్యతిరేక కమిటీ వివిధ ప్రజాసంఘాలు, మహిళా సంఘాలతో ఏర్పడింది. అందులో మనం కూడా భాగస్తులుగా వుండి కార్యక్రమాల్లో పాల్గొన్నాం. ఇంకా ఈ కమిటీ కార్యక్రమాలు నిర్వహిస్తూనే వున్నది.

**రాష్ట్రం బయట కార్యక్రమాలు:**

⇨రెండుసార్లు కాశ్మీర్‌కు వెళ్ళి పరిస్థితిపై విషయసేకరణ చేయడం జరిగింది.

⇨అస్సాంలో మానవహక్కుల పరిస్థితిపై ఇతర సంఘాలతో కలిసి వెళ్ళడం జరిగింది.

⇨బెంగాల్‌లో కొన్ని ప్రాంతాల్లో వామపక్ష ప్రభుత్వం నక్సలైట్ పార్టీలపై విరుచుకుపడి, ఎన్‌కౌంటర్లు చేస్తూ తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించింది. ఇతర సంస్థలతో కలిసి నిజనిర్ధారణ కమిటీలో వెళ్ళడం జరిగింది.

⇨కర్నాటక ప్రభుత్వం నిర్మించిన అల్మెట్టి డ్యాం విషయంలో దాని ఎత్తుపై వివాదం చెలరేగినప్పుడు, ఇతర సంఘాలతో ఆల్మట్టిని సందర్శించి, విషయ సేకరణ చేయడం జరిగింది.

**మానవహక్కుల అవగాహన కోసం కార్యక్రమాలు:**

మన సభ్యులకు, ప్రజలకు మానవహక్కుల విషయంలో అవగాహన కల్పించడానికి, చైతన్యపరచడానికి, మనం ప్రత్యేకమైన శ్రద్ధ చూపాం. వరంగల్, మెదక్, విశాఖపట్టణం, శ్రీకాకుళం, జంటనగరాలు, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో అవగాహన తరగతులు నిర్వహించాం. అందులో మానవహక్కుల చరిత్ర, రాజ్యాంగం, మానవహక్కులు, ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ, వ్యవసాయ రంగంలో సంక్షోభం మొదలైన అంశాలపై ఉపన్యాసాలు ఏర్పాటు చేసాం. ఆదీవాసీ సంస్థలు రాజమండ్రి, జంగారెడ్డిగూడెంలో ప్రత్యేకంగా ఏర్పరచుకున్న తరగతులను మన సంస్థనే బాధ్యత తీసుకొని నిర్వహించింది. ఏ సంస్థ హక్కుల అంశంపై ఉపన్యసించమని అడిగినా విధిగా నేను, బాలగోపాల్, కోదండరాం, రాములు, చంద్రశేఖర్, మురళీగార్లు పాల్గొంటూ వస్తున్నాం. స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు నిర్వహించే మానవహక్కుల శిక్షణా తరగతులకు కూడా మన వీలును బట్టి ఉపన్యాసకులుగా వెళుతున్నాం. విద్యాసంస్థల్లో, యూనివర్సిటీల్లో 'అంతర్జాతీయ మానవ హక్కుల దినం' సందర్భంగా ఏర్పరిచే కార్యక్రమాల్లో వక్తలుగా పాల్గొంటున్నాం.

**ప్రచురణలు:**

⇨'మానవహక్కులు' పేరుతో బులెటిన్‌ను ప్రతి ఆరునెలలకొకసారి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం. బులెటిన్‌లో సంపాదకీయం కాకుండా కనీసం మూడు వ్యాసాలు, మూడు రిపోర్టులు, జ్యుడీషియల్ వాచ్ శీర్షికలు రెండు

కోర్టు తీర్పుల విశ్లేషణ ఉండేట్లు చూస్తున్నాం. ఒక పుస్తక సమీక్షతో బాటు, ఆరునెలల కాలంలో ప్రచురించిన హక్కుల అంశాల్ని విశ్లేషించిన కరపత్రాలను కూడా ప్రచురిస్తున్నాం. బులెటిన్ అందరికి అందుబాటులో వుండే విధంగా పది రూపాయలకు మించకుండా వుండేట్టు చూస్తున్నాం.

⇨బొంబాయి అల్లర్లపై నియమించిన శ్రీకృష్ణ కమీషన్ నివేదికను, తెలుగులో అనువాదం చేసి ప్రచురించాం.

⇨'అణ్వాయుధాలు-మనం' అనే అంశంపై 'అణ్వాయుధాల వ్యతిరేక వేదిక' పేరుతో పుస్తకాన్ని ప్రచురించాం.

⇨ ఆదివాసీల భూముల విషయంలో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యానాలపై కేంద్రప్రభుత్వ పర్యావరణ శాఖ విడుదల చేసిన సర్క్యులర్ అంశాలను నిరసిస్తూ 'ఎవరిదీ అడవి' అనే పుస్తకం ప్రచురించాం.

⇨గుజరాత్ అల్లర్లపై 'గాంధీరాజ్యంలో గాడ్సే పాలన' అన్న పుస్తకాన్ని ప్రచురించాం.

⇨కాశ్మీర్‌పై ఇతర సంస్థలతో కలిసి చేసిన నిజనిర్ధారణ కమిటీ రిపోర్టును ఇంగ్లీషులో పుస్తకంగా ప్రచురించాం.

⇨ఎన్నికల సమయంలో రాష్ట్రంలో 'మానవహక్కుల పరిస్థితి' అన్న అంశంపై ఒక చిన్న పుస్తకాన్ని 'ఆం.ప్రదేశ్‌ను ప్రపంచ బ్యాంకు నుండి కాపాడే సంస్థ' ఆధ్వర్యంలో ప్రచురించాం.

⇨సభల సందర్భంగా బులెటిన్-7 సభల ప్రత్యేక సంచికగా వెలువరిస్తున్నాము.

⇨అనంతపురం జిల్లాలో గత కొద్ది సంవత్సరాలుగా వేరుసెనగ రైతులు అనుభవిస్తున్న కష్టాలపై బాషాగారు వ్రాసిన వ్యాసాలను పుస్తకంగా తెస్తున్నాం.

⇨ఆదివాసీల సమస్యలపై వివరమైన పుస్తకం తేవాలనుకున్నాం. వ్యాసాలు సేకరించటం జరిగింది. త్వరలో పుస్తకం వస్తుంది.

**సంస్థాగత విషయాలు:**

మెదక్ జిల్లాలో చాలాకాలంగా ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంస్థను

బలోపేతం చేసి హక్కుల ఉద్యమానికి పునాది వేసిన బయ్యారంరామిరెడ్డి 1999వ సంవత్సరంలో ఆగస్ట్ 17న హఠాత్తుగా గుండెజబ్బుతో మరణించడం చాలా విచారకరం. అతి పేద రైతు కుటుంబం నుంచి వచ్చిన రామిరెడ్డి ప్రజల పక్షాన, ప్రజాస్వామిక హక్కుల సాధన కోసం నిబద్ధతో పనిచేసాడు. మానవహక్కుల వేదిక వ్యవస్థాపక సభ్యుడుగా హక్కుల అంశాలపై చాలా చురుకుగా పనిచేసాడు. ఆయన మరణం తర్వాత, ఆయన భార్య పద్మగారిని మనమే బాధ్యతతో హైదరాబాద్ తీసుకుని వచ్చి ఒక స్వచ్ఛంద సంస్థలో ఉద్యోగం ఇప్పించాం. ఉండటానికి వసతి కూడా కల్పించాం. రెండేళ్ళ తర్వాత పద్మకూడా జబ్బుకు గురై మరణించింది. మన ప్రారంభ బులెటిన్‌ను రాంరెడ్డి స్మృతికి అంకితం చేసాం. మెదక్ యూనిట్ ప్రతి సంవత్సరం రాంరెడ్డికి నివాళులు అర్పిస్తూ, ఒక ఉపన్యాసం ఏర్పాటు చేస్తుంది.

2002 సంవత్సరంలో ఫిబ్రవరి నెలలో కాకతీయ యూనివర్సిటీలో ఉపన్యాసకుడిగా పనిచేస్తున్న డా. బి. జనార్ధన్‌రావు అకస్మాత్తుగా గుండెజబ్బుతో మరణించాడు. హక్కుల ఉద్యమానికి మిత్రుడైన జనార్ధన్‌రావు, ప్రత్యేకంగా ఆదివాసీల హక్కుల కోసం, వెనకబాటుకు గురైన తెలంగాణా ప్రాంతం ప్రజల హక్కుల సాధన కోసం నిరంతరం శ్రమ చేసాడు. హక్కుల ఉద్యమానికి మిత్రుడైన జనార్ధన్‌రావు స్మృతిలో 'ఎవరిదీ అడవి' అనే పుస్తకాన్ని ప్రచురించాం. సంస్థ ప్రారంభించినప్పుడు నిర్మాణాల గురించి ఆలోచించకుండా ఎపిసిఎల్‌సి నుండి బయటకు వచ్చిన వాళ్ళం మాత్రమే మన దృక్పథం ప్రకారంగా ఎంచుకున్న రంగంలో కార్యక్రమాలు చేపట్టాలని అనుకున్నాం. రెండేళ్ళ తరువాత సమీక్షించుకుని మొదటి బులెటిన్ ప్రచురించి నిర్మాణం విషయంలో ఆలోచించడం ప్రారంభించాం. సంస్థలో సభ్యుల్ని చేర్చుకోడానికి రెండు మూడు పద్ధతుల్ని ఎంచుకున్నాం.

- మన అవగాహనతో ఏకీభవించి చేస్తున్న పనిలో నిజాయితీగా ఉండి కొంత సమయాన్ని సంస్థకు కేటాయించేవాడై వుండాలి.
- ఏదేని రాజకీయ పార్టీలో/సంస్థలో సాధారణ సభ్యుడై వుండి మన అవగాహనతో ఏకీభవిస్తే పరవాలేదనుకున్నాం.

- రాజకీయ పార్టీలో/సంస్థలో బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తిని సంస్థలోకి తీసుకోకూడదనుకున్నాం.
- మతచాందసవాదం ప్రదర్శించే వ్యక్తుల్ని దూరంగా ఉంచాలనుకున్నాం.

మనం పనిచేస్తున్న క్రమంలో కార్యక్రమాల్లో పాల్గొన్న వ్యక్తుల్ని పరిశీలించి సభ్యులుగా చేర్చుకున్నాం. మానవహక్కుల అవగాహనపై తరగతులు నిర్వహించి మనం వ్యక్తపరిచిన భావాలు మన అవగాహనతో ఏకీభవించిన వారిని సభ్యులుగా చేర్చుకున్నాం. ఇప్పుడు దాదాపు 19 జిల్లాల్లో మనకు నిర్మాణం ఉంది. కొన్ని జిల్లాల్లో పూర్తిస్థాయి నిర్మాణం, మరికొన్ని జిల్లాల్లో కొందరు సభ్యులు, కన్వీనర్‌తో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వేదిక ఏర్పడ్డప్పుడు నన్ను, మధుసూదన్‌రాజ్, సునీతగార్లను కన్వీనర్లుగా ఎన్నుకోవడం జరిగింది. ఒక సంవత్సరం తర్వాత సునీతగారికి కుటుంబభారం పెరగడం, మధుసూదన్‌రాజ్‌గారు కూడా ఏవో కారణాల వల్ల అంత ఆసక్తి చూపలేకపోయారు. మన సంస్థలో పూర్తికాల కార్యకర్తలు ఎవరూ లేరు. ఉద్యోగాలు, వృత్తులు చేసుకుంటూ కొంత సమయాన్ని సంస్థకి కేటాయించడం జరుగుతున్నది. కొందరు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తే, మరికొందరు తక్కువ సమయాన్ని సంస్థ పనులకోసం కేటాయించగలుగుతున్నారు. మన సంస్థలో పనిచేసే వ్యక్తులందరు కూడా నిత్య జీవితంలో నిజాయితి, నిబద్ధత, మంచి విలువలు కాపాడుకోవడం కోసం తపన కలిగిన వ్యక్తులే. అయినప్పటికి ఒకటి రెండు సందర్భాలలో మన సభ్యుల మీద ఆరోపణలు రావడం జరిగింది. ప్రకాశం జిల్లా వేణుగోపాల్‌పైన అక్కడ ఉండే సోదర హక్కుల సంస్థతోపాటు పోలీసులు కూడా చాలా ఆరోపణలు చేస్తూ వచ్చారు. ఒక దశలో వేణుగోపాల్‌గారు కొంతకాలం తానే స్వయంగా సంస్థకు దూరంగా వుండి తన్ను తాను సమీక్షించుకుని సంస్థలో తిరిగి పనిచేస్తున్నారు. అయితే ప్రకాశం జిల్లాలో ఉన్న పరిస్థితిలో పోలీసుల అత్యాచారాలపై చట్టవిరుద్ధ కార్యకలాపాలపై చాలా కృషి చేశారు. అందువలన పోలీసులు పనికట్టుకుని ఆయనపై కక్షతో వ్యవహరిస్తున్నారు. ఇందులో భాగంగానే ఎస్‌సి, ఎస్టీ అత్యాచారాల కేసు ఆయనపై బనాయించారు. ఒంగోలులో మావోయిస్టులు ఎస్‌పి కారుపై చేసిన

దాడి సందర్భంగా కూడా ఆయనను తీసుకెళ్ళి ప్రశ్నించారు. ఇప్పటికి వేణుగోపాల్ కొంత అభద్రత, అనిశ్చిత పరిస్థితి ఎదుర్కొంటున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కన్వీనర్ కె. రాజేంద్రప్రసాద్‌పై కూడా పోలీసులు అనవసరంగా కేసు బనాయించి నానా గందరగోళం చేశారు. అక్కడ జరిగిన విషయాలను వివరంగా సేకరించి పోలీసు అక్రమ ఆలోచనని కరపత్రం ద్వారా ప్రచారం చేసిన తర్వాత సర్దుకున్నారు. వరంగల్‌లో బుర్రా రాములుకు ఇంకా బెదిరింపు ఫోన్‌కాల్స్ వస్తూనే ఉన్నాయి. వరంగల్‌లో మానవహక్కుల వేదిక ఒక్కటే అన్ని రకాల హక్కుల ఉల్లంఘనల గురించి మాట్లాడడం పోలీసు దుశ్చర్యల్ని ఎండగట్టడం జరుగుతున్నది. సంస్థ చేసే కార్యక్రమాలకి దళిత,స్త్రీ సంఘాల మద్దతు బాగా వుంటుంది. అయితే రాములును నిస్పృహపరిచి కార్యక్రమాల నుండి దూరం చేయాలనే తలంపుతో పోలీసులు బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నట్లు అర్థం అవుతుంది. ఇటువంటి పరిస్థితి ఎప్పుడు ఉత్పన్నం అయినా పై అధికారులకి తెలియజేయడం హోంమంత్రి దృష్టికి తేవడం జరుగుతుంది. గుంటూరు కన్వీనర్ బి. చంద్రశేఖర్‌గారు హక్కుల అవగాహన విషయంలో తనకొక భిన్నమైన దృక్పథం వుందని, తాను సంస్థలో ఉండనని రాజీనామా చేశారు. రాష్ట్ర కార్యవర్గం ఆయన దృక్పథాన్ని చర్చకు పెట్టి సంస్థలో కొనసాగాలని విజ్ఞప్తి చేసింది. అయినా చంద్రశేఖర్‌గారు తన అసమ్మతిని తెలపడంతో రాజీనామాను అంగీకరించడం జరిగింది.

మన సంస్థ రాష్ట్రంలో అన్ని హక్కుల సంఘాలతో మంచి సంబంధాలు కొనసాగిస్తూ వుంది. కొన్ని సందర్భాలలో హక్కుల అంశంపై ఓపిడిఆర్, పియుసిఎల్, ఎపిసియల్‌సితో కలిసి కరపత్రాలు వేయడం, సమావేశాలు నిర్వహించడం చేశాం. పోటా రద్దు విషయంలో అన్ని సంఘాలతో కలిసి పనిచేశాం. రాష్ట్రంలో శాంతిని పునరుద్ధరించి చర్చల వాతావరణం కొరకు ఎపిసియల్‌సితో కలిసి గత నెలలో ఒక సమావేశం నిర్వహించాం.

**ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వని అంశాలు:**

- మహిళలపై వ్యవస్థీకృతమైన హింస, వివక్ష, వరకట్న హత్యలు, మహిళల ఆరోగ్యం

- ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు, ప్రజారోగ్యం
- అవినీతి, కుంభకోణాలు, ప్రభుత్వ అసమర్థత వల్ల పౌరుల హక్కుల భంగం.
- మైనార్టీల ప్రత్యేక సమస్యలు

**మనం ఇంకా నిర్వహించవలసిన ఉద్యమాలు:-**

- సమాచార హక్కు కోసం ఉద్యమం
- పెద్ద ప్రాజెక్టుల వ్యతిరేకోద్యమం
- ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ వల్ల సాంప్రదాయక వృత్తులపై జీవిస్తున్న ప్రజలకు కలిగే హాని విషయంలో అధ్యయనం
- చిన్న పరిశ్రమలు, సహకార సంస్థల పునరుద్ధరణకు ప్రభుత్వంపై వత్తిడి
- సాగునీటిని న్యాయంగా పంచడం కోసం ఉద్యమం
- మార్కెట్ కమిటీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం
- నగరీకరణ(అర్బనైజేషన్)లో పేదలకు జరుగుతున్న అన్యాయాలు-పేదవర్గంపై ప్రభుత్వ వివక్షపై దృష్టి

**ముగింపు:**

హక్కుల కోసం పని చేసేటప్పుడు మనం సహజంగానే ప్రజలు నిత్య జీవితంలో ఎదుర్కొనే హక్కుల లేమి పైన ఎక్కువ దృష్టి పెడతాం. లాకప్పులో ఒక నిందితుడిని కొట్టి చంపారనీ, కట్నం కోసం ఒక భార్యను కాల్చి చంపారనీ, ఈ ఊళ్ళో గుడిసెలు కూల్చారనీ, ఆ ఊళ్ళో దళితులను వెలివేసారనీ నిజనిర్ధారణలు చేస్తుంటాం, ఆందోళన చేస్తుంటాం.

దీని అర్థం మనమీ సమస్యలన్నిటినీ స్థానికమైనవిగా చూస్తున్నామని కాదు. వీటికి చరిత్రలో, సామాజిక జీవితంలో, పాలనా విధానాలలో ఉన్న మూలాలను గుర్తిస్తున్నాం. ఆ మూలాలలో మార్పులు తీసుకొచ్చే కృషిలో అంతర్భాగంగా మన కార్యక్రమాలను, మన అజెండాను చూస్తున్నాం.

వీటిలో రెంటిని స్పష్టంగా గుర్తించి ప్రస్తావించవలసి ఉంది. ఒకటి అంతర్జాతీయంగానే రాజకీయాలలో ఆర్థిక నీతిలో ప్రజా జీవిత విలువలలో 'ప్రపంచీకరణ' పేరిట వేగవంతంగా వస్తున్న మార్పులు. ఐక్యరాజ్య సమితి పునాదిపైన, ఇరాక్‌పైన చేసిన యుద్ధాలను చూసాం. సిరియా, ఇరాన్, ఉత్తర

కొరియాలపైన కాలు దువ్వుతున్న వైనాన్ని చూస్తున్నాం. అంతర్జాతీయ రాజకీయాలలో బలమున్న వాడిదే నీతి అన్న ధోరణి అమెరికా ప్రవేశపెట్టింది. దాదాపు మొదటి ప్రపంచ యుద్ధం కాలం నుండి అంతర్జాతీయ రాజకీయాలలో ప్రజాతంత్ర ప్రమాణాలను ప్రవేశపెట్టడం కోసం జరుగుతున్న కృషిని పూర్తిగా వమ్ము చేసింది. మన దేశ పాలకులు దీనిని ప్రతిఘటించి ఐక్యరాజ్య సమితిని కాపాడే కృషిలో భాగమయ్యే బదులు ఈ దౌర్జన్యానికి సహకరించి అమెరికా దృష్టిలో మంచివారనిపించుకోవాలని ఆరాటపడుతున్నారు.

ఆర్థిక విధానాల విషయము ఇంతే. సంక్షేమ రాజ్య భావనను, దేశ కాల ప్రత్యేకతలను బట్టి ఆర్థిక విధాన నీతి ఉండాలన్న భావనను పక్కనబెట్టి పెట్టుబడి పెరుగుదలను వేగవంతం చేసేదే అభివృద్ధి అనే సిద్ధాంతాన్ని అందలమెక్కించారు. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ వాణిజ్యసంస్థల ఆధ్వర్యంలో దీనిని అన్ని దేశాల గొంతుల్లోకి బలవంతంగా కుక్కుతున్నారు. మన దేశ పాలకులు దీనికి సంతోషంగా ఆహ్వానిస్తున్నారు. ప్రజల జీవితంలోని అన్ని మూలాలలోను ఇది బలంగా తాకుతున్నది. విధ్వంసం సృష్టిస్తున్నది.

రెండవది, మన దేశ సామాజిక జీవితంపైన రోజురోజుకు పెరుగుతున్న హిందుత్వవాద ప్రభావం. హిందుత్వ వాదం కేవలం మతవాదం కాదని, అదొక సామాజిక తత్వమనీ మనం గుర్తిస్తున్నాం. దానివలన మైనార్టీలకే కాదు, సమస్త పీడిత ప్రజానికానికి హాని అని కూడా గుర్తిస్తున్నాం. దశాబ్దాలుగా మన సమాజంలో అసమానతను, అణచివేతను ఎదుర్కొంటున్న ప్రజలు పోరాడి సాధించుకున్న అన్ని ప్రజాతంత్ర హక్కులకు ప్రజాస్వామ్య అవకాశాలకు హిందూత్వ వాదం శత్రువు. అది ఆధిపత్యానికి ఎదగడం అనేది కేవలం భారతీయ జనతా పార్టీకి లభిస్తున్న ఓట్లలో చూడవలసిన విషయం కాదు. అన్ని సామాజిక జీవిత రంగాలలోనూ ఆధిపత్యం ఛాయలు చూడవచ్చు. అది అన్ని రకాలుగా మానవీయతకూ మానవ హక్కుల భావనకు భంగకరం, నష్టకరం.

హక్కుల లేమికీ, అతిక్రమణకూ సామాజిక జీవితంలో మొదటి

నుండి వ్యవస్థితమయి ఉన్న అన్ని మూలాలనూ ఈ రెండు సమకాలీన పరిణామాలు మరింత తీవ్రతరం చేస్తున్నాయి. ఈ విషయాన్ని మనం స్పష్టంగా గుర్తించి మన ఆచరణను, అవగాహనను రూపొందించుకుంటున్నాం. ఇక మన కర్తవ్యాల గురించి ఒకసారి చెప్పుకుందాం. మనం అన్ని సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక హక్కులను మానవ హక్కులుగానే అర్థం చేసుకుంటాం. వాటి విశదీకరణ కోసం, వ్యవస్థీకరణ కోసం, పెంపుదల కోసం అమలు కోసం పనిచేస్తున్నాం.

తరచుగా ఈ హక్కుల కోసం ఏదో ఒక రాజకీయ ఉద్యమం పనిచేస్తుంటుంది. అదొక రాజకీయ పార్టీ నడిపే ఉద్యమం కావచ్చు. లేదా రాజకీయ స్వభావం గల ప్రజా సంఘం నడిపేది కావచ్చు. అంతమాత్రం చేత మనకక్కడ కర్తవ్యం ఏమీ లేదని మనము అనుకోవడం లేదు. హక్కుల కోసం రాజకీయ ఉద్యమాలు చేసే కృషి వేరు, హక్కుల ఉద్యమం చేసే కృషి వేరు. రెండింటి అవసరమూ ఉంటుంది. అయితే దేని పాత్ర దానికి ఉంటుంది. మనం ఆయా హక్కుల కోసం పనిచేసే రాజకీయ ఉద్యమాలకు సంఘీభావంగా పనిచేస్తూనే, హక్కుల కోణం నుండి సమస్య మీద కృషి, మన స్వతంత్ర అస్తిత్వాన్ని కాపాడుకుంటూ పనిచేస్తాం. నక్సలైట్ ఉద్యమంపైన నిర్బంధాన్ని వ్యతిరేకించే కృషినుండి దళితుల హక్కులకు అండగా నిలబడే కృషిదాకా అనేక రంగాలలో మనకు ఈ విషయంలో ఇప్పటికే అనుభవము ఉంది.

ఇంత విస్తృతమైన అజెండా మనం పెట్టుకున్నప్పుడు దాన్ని కేవలం కాగితాలపైన కాక ఆచరణలోనూ నిలబెట్టుకోవాలంటే నిత్య కృషి అవసరం. ఏ రాజకీయాలు గలవారైనా సరే మన ప్రణాళికనూ మన ప్రాపంచిక దృక్పథాన్ని స్థూలంగా అంగీకరించేవారిని గుర్తించి మన కార్యక్రమాలలో భాగం చేసి నిర్మాణంలోకి తీసుకురావడం ద్వారా ఈ కృషిని బలోపేతం చేయగలుగుతాం. అది కార్యక్రమాలు చేపట్టే క్రమంలోనే జరుగుతుంది తప్ప వేరే విధంగానూ కాదు. కాబట్టి మన ఆచరణాత్మకమైన కృషిని పెంచుకుంటూ అదే క్రమంలో దానికి అవసరమైన నిర్మాణాన్ని పెంచుకుంటూ ముందుకు పోదాం. విశాలమైన, స్వతంత్రమైన హక్కుల ఉద్యమం అవసరమే కాదు, సాధ్యం కూడానంటూ

ఏ ప్రకటనతోనైతే **మానవ హక్కుల వేదిక**ను ఏర్పాటు చేసుకున్నామో అది కేవలం కాగితానికి పరిమితమైన ప్రకటన కాదని ఆచరణీయమేనని రుజువు చేద్దాం.

కృతజ్ఞతలతో,
ఎస్. జీవన్‌కుమార్
కన్వీనర్
మిర్యాలగూడ
7, 8 మే 2005